www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 02 | సంచిక : 180 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య | పేజిలు : 8 | వెల రూ. 2 | గురువారం -01 - అక్టోబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana





## కిటకిటలాడుతున్న తిరుమల గిరులు.. సర్వదర్శనానికి పోటెత్తిన భక్తులు..

- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ
- సర్వదర్శనానికి 24 గంటల సమయం
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నిండి బయటకు చేరిన క్యూలైన్లు
- మంగళవారం శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.22 కోట్లు

తిరుపతి: తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో వైకుంఠం

# దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీ అగ్ర స్థానంలో ఉంది

## ఐగాట్ కర్మ యోగి ద్వారా వివిధ కోర్సుల్లో శిక్షణ ఇప్పించాం

- ఉద్యోగులకు ఐఐటీ, ఐఐఎంలతో నైపుణ్య శిక్షణ
- తాగునీటి సమస్యపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిరంతర ప్రక్రియగా ఉండాలి
- రియల్ టైమ్‌లో పని చేసేలా ఉద్యోగులు శిక్షణ పొందుతున్నారు




అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిరంతర ప్రక్రియగా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖలు అందించే సేవలపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు. ప్రభుత్వ ఉద్యోగులకు మిగతా 2 లో

## ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలు.. సీఎం చంద్రబాబుకు ఆహ్వానం




- అక్టోబర్ 11 నుంచి 20 వరకు ఉత్సవాలు
- క్యాంపు కార్యాలయంలో ఆహ్వానపత్రిక అందజేత
- సీఎంకు అమ్మవారి ప్రసాదం, వేదాశీర్వచనం
- ఉత్సవాల ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్న సీఎం
- భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశం

అమరావతి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఈ నెల 11 నుంచి 20 వరకు జరగనున్న దసరా మహోత్సవాలకు ముఖ్యమంత్రి




## నా ఆస్తులు రూ.1,400 కోట్లు, అన్నీ చట్టబద్ధమే: డీకే శివకుమార్

- కేంద్ర మంత్రి కుమారస్వామికి డీకే కౌంటర్
- నిరాశతో తనపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శ
- సీఎంగా ఉన్నప్పుడు నైస్ ప్రాజెక్టుపై మౌనంగా ఎందుకున్నారని ప్రశ్న
- ఎలాంటి దర్యాప్తుకైనా తాను సిద్ధమని స్పష్టీకరణ
- బెదిరింపులకు, బ్లాక్‌మెయిళ్లకు భయపడనని తేల్చిచెప్పిన శివకుమార్

కర్ణాటక : తన ఆస్తుల విషయంలో కేంద్ర మంత్రి హెచ్.డి.కుమారస్వామి చేస్తున్న ఆరోపణలపై



## డెల్టా సీఈవోపై మస్క్ ఫైర్.. మీ ఉద్యోగం ఊడుతుంది జాగ్రత్త అంటూ వార్నింగ్!

ఢిల్లీ: ప్రముఖ విమానయాన సంస్థ డెల్టా ఎయిర్‌లైన్స్, టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. తమ విమానాల్లో వైఫై సేవల కోసం మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌ను కాదని, అమెజాన్‌కు చెందిన 'లియో' శాటిలైట్ వ్యవస్థను ఎంచుకోవడంపై మస్క్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు డెల్టా సీఈవో ఎడ్ బాస్టియన్ తన ఉద్యోగాన్ని కోల్పోతారని హెచ్చరించడం మిగతా 2 లో

- స్టార్‌లింక్‌ను తిరస్కరించిన డెల్టా ఎయిర్‌లైన్స్‌పై మండిపడ్డ మస్క్
- మస్క్ ప్రతిష్ఠపై సీఈవో ఎడ్ బాస్టియన్ చేసిన వ్యాఖ్యలతో రాజుకున్న వివాదం
- ఈ నిర్ణయం వల్ల మీ ఉద్యోగం పోవడం ఖాయమంటూ సీఈవోకు మస్క్ వార్నింగ్
- స్టార్‌లింక్‌ను కాదని అమెజాన్ 'లియో' వైఫై కోసం డెల్టా ఒప్పందం

## మహిళల కోసం భవిష్యత్తులో ఏసీ బస్సులు కొంటాం

### ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం

- "డబుల్ ఇంజిన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది
- 26,401 మందికి ఇళ్ల పట్టాలు అందిస్తున్నాం
- గత వైకాపా పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం
- గత ప్రభుత్వం భూ సర్వే పేరుతో ప్రతి ఊరిలో వివాదాలు సృష్టించింది



విజయవాడ: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. విజయవాడలో నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "డబుల్ ఇంజిన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో మిగతా 2 లో

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులపై దుమారం..

### కాంగ్రెస్‌ను నిలదీసిన కవిత

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన
- రెండు స్థానాల్లోనూ రెడ్డి సామాజిక వర్గానికే అవకాశం
- ఇది సామాజిక అన్యాయమంటూ కవిత తీవ్ర విమర్శ



హైదరాబాద్: తెలంగాణలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల మిగతా 2 లో




## రబీ సీజన్ కు పంటల మద్దతు ధర పెంపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం

- ఢిల్లీలో స్మార్ట్ ట్రాఫిక్‌కు కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్
- రూ.1,789.52 కోట్ల అంచనా వ్యయంతో ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలుకు ఆమోదం
- ఢిల్లీలోని 42 ప్రధాన ట్రాఫిక్ కారిడార్లను మూడు దశల్లో 24 నెలల్లో ఈ వ్యవస్థ పరిధిలోకి తీసుకురానున్నారు
- అంబులెన్సులు, అత్యవసర వాహనాలకు గ్రీన్ కారిడార్ సౌకర్యం

# మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలి

## తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చొరవ తీసుకోవాలి

- మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించాం
- ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు తాము చర్చిస్తున్నాం
- ఆయా ప్రాజెక్టులకు వెంటనే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలి
- సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలి



హైదరాబాద్: : తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి ఢిల్లీలో జల్ శక్తి మంత్రి పాటిల్ గారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులకు మిగతా 2 లో

## ఆసియా క్రీడల్లో ఆర్చర్ చికితకు ఒకేరోజు రెండు స్వర్ణాలు..

### సీఎం రేవంత్ రెడ్డి అభినందన




- ఆసియా క్రీడల్లో తెలంగాణ ఆర్చర్ చికితకు రెండు స్వర్ణాలు
- చికితను అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని ప్రశంస
- ఈ విజయంతో 2028 ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన చికిత
- పెద్దపల్లి జిల్లాకు చెందిన క్రీడాకారిణి చికిత

# సంపాదకీయం

## అసలు నకిలీ

మార్లిన్ మన్రో అంటే దాదాపుగా హాలీవుడ్ దేవత. జాన్ స్టెయిన్‌బెక్ ఏమో నోబెల్ గౌరవానికి నోచుకున్న నవలా రచయిత. సహజంగానే రచయితలకంటే నటీమణులకే క్రేజ్ ఎక్కువన్నది ఏ ప్రాంతానికైనా వర్తించే సత్యం కాబట్టి, అమెరికా కూడా అందుకు మినహాయింపు కాదు. స్టెయిన్‌బెక్ భార్య తరఫు మేనల్లుడైన ఓ 17 ఏళ్ల కుర్రాడు మార్లిన్ 'బానిస'. అలాంటివాడికి మార్లిన్‌ను స్టెయిన్‌బెక్ కలిశాడనే 'ఘోరమైనతప్పిదం' మేనత్త చేసిందట. ఆ కుర్రాడు దాన్ని నమ్మకపోయినా మామగారి పట్ల అతడి 'మర్యాద' ఆకాశాన్నంటింది. ఇక తప్పదన్నట్టుగా, ఆటోగ్రాఫ్ చేసిన ఒక ఫొటోను పంపమంటూ 1955లో న్యూయార్క్ నుంచి మార్లిన్‌కు ఓ లేఖ రాశాడు స్టెయిన్‌బెక్. భాష, శైలి, చమత్కారం వల్ల పదేపదే వైరల్ అయ్యే ఈ లేఖను ఈమధ్యే ప్యాట్రిక్ ఓషానెసీ అనే వ్యాపారవేత్త 'ఎక్స్'లో పంచుకున్నాడు. దీన్నే శశి థరూర్ ఓ నాలుగేళ్ల కింద షేర్ చేశాడు. అయితే, ఇందులోని శైలి స్టెయిన్‌బెక్‌దే అయినా, నిజంగా ఆయనే రాశాడనేందుకు ఆధారాలు లేవనే సందేహాలూ ఉన్నాయి. స్టెయిన్‌బెక్‌ది కాకపోతే స్టెయిన్‌బెక్ అంతటివాడు ఆవహించి రాసినదై ఉండాలి.

చరిత్రలో కొన్ని అబద్ధాలు ఎంత అందంగా ఉంటాయంటే అవి నిజమైతే బాగుండనిపిస్తుంది. ఒక మహానుభావుడి చేతిరాత కనిపిస్తే, ఒక నియంత రహస్య డైరీ దొరికితే, ఒక గొప్ప కవి ప్రేమలేఖ చేతికి చిక్కితే-- అవి నిజం కాదనే అనుమానమే అన్యాయంగా తోస్తుంది. అందుకే చరిత్రలోని కొన్ని మోసాలు కేవలం మోసాలుగా మిగిలిపోలేదు. సాహిత్యాన్నీ, జర్నలిజాన్నీ, పరిశోధననూ, మనుషుల ఊహాశక్తినీ పరీక్షించిన అద్భుతమైన కథనాలుగా మిగిలిపోయాయి. 1983లో జర్మన్ పత్రిక స్టెర్న్ 1932 నుంచి 1945 వరకు అడాల్ఫ్ హిట్లర్ రాసినట్లుగా చెప్పిన దాదాపు అరవై సంపుటాల డైరీలు దొరికాయని ప్రకటించింది. యుద్ధం చివరి దశలో హిట్లర్ వ్యక్తిగత వస్తువులను తరలిస్తున్న విమానం కూలిపోవడంతో ఆ డైరీలు బయటపడ్డాయని కథనం. కానీ ఫోరెన్సిక్ పరీక్షలు కాగితం, సిరా రెండో ప్రపంచ యుద్ధం తర్వాతివని తేల్చాయి. కోన్రాడ్ కుజావు అనే చిత్రకారుడి సృజనాత్మక మోసం అలా బయటపడింది.

ముందు వాటిని అసలువని ఎందుకు నమ్మారు? అవి నిజమైతే బాగుండనే భావన మనుషులను అమాయకులను చేయడంవల్ల. ఇదే బలహీనత అబ్రహాం లింకన్ ప్రేమలేఖల ఉదంతంలోనూ కనబడుతుంది. 1928లో అమెరికా పత్రిక అట్లాంటిక్ మంత్లీలో 'లింకన్ ద లవర్' పేరుతో ఆన్ రట్లెడ్జ్‌కు లింకన్ రాసినట్టుగా చెప్పిన లేఖలు ప్రచురితమయ్యాయి. కానీ వాటి భాష, శైలి, ఆ కాలపు పదప్రయోగాలు అనుమానాస్పదంగా తోచాక రచయిత్రి విల్మా ఫ్రాన్సిస్ మైనర్ చేసిన సాహిత్య మోసం బయటపడింది. ఇక 18వ శతాబ్దం చివర్లో లండన్‌లో విలియం హెన్రీ ఐర్లాండ్ అనే కవి ఏకంగా షేక్స్పియర్ స్వహస్తాలతో రాసిన లేఖలు, అన్నే హాత్‌వేకి రాసిన ప్రేమలేఖలు, కింగ్ లియర్, హామ్లెట్ వంటి రచనల చేతిరాత ప్రతులతోపాటు షేక్స్పియర్ సరికొత్త నాటకం 'వాటిగెర్న్ అండ్ రొవెనా'ను 'కనుగొన్నాడు'. ఇంత కష్టపడి ఎందుకు నకిలీవి సృష్టిస్తారంటే దానికున్న మార్కెట్, సంచలన యావ, సరదా. అంతెందుకు, సాంస్కృతిక వారసత్వపు వెన్నువిరవకుండా భారతదేశాన్ని జయించలేమని ప్రచారంలో ఉన్న 1835 ఫిబ్రవరి 2 నాటి లార్డ్ మెకాలే ప్రసంగం కూడా ఉత్తిదేనని కథనాలు వెలువడ్డాయి. భావజాల పరంగా మెకాలే అలాంటివాడే కావొచ్చుగానీ ఆ లేఖ మీద మాత్రం వివాదం లేకుండా లేదు.

ఇప్పుడు ఇదంతా ఎందుకంటే, స్టీఫెన్ థేలర్ అనే ఏఐ పరిశోధకుడు 'ఎ రీసెంట్ ఎంట్రన్స్ టు ప్యారడైజ్' అనే చిత్రాన్ని డాబస్ ఏఐ టూల్‌తో గీయించి, ఆ చిత్ర సృష్టికర్తగా దాన్నే అంగీకరించాలని పెట్టుకున్న కాపీరైటు అర్జీని భారత ప్రభుత్వ కాపీరైట్ కార్యాలయం ఇటీవలే కొట్టేసింది. దాన్ని ఒరిజినల్ వర్క్‌గా అంగీకరిస్తూనే, మానవ ప్రమేయం లేని ఈ కళకు కాపీరైట్ ఇవ్వడానికి తిరస్కరించింది. తనను సృష్టికర్తగా చెప్పుకోవడానికి థేలర్ అంగీకరించలేదు. కృత్రిమ నకిలీల కాలంలో ఆ మేరకు ఆయన సహజ అభినందనకు అర్హుడు.

## డెల్టా సీఈవోపై మస్క్ ఫైర్..
## మీ ఉద్యోగం ఊడుతుంది జాగ్రత్త అంటూ వార్నింగ్!

ఢిల్లీ: ప్రముఖ విమానయాన సంస్థ డెల్టా ఎయిర్‌లైన్స్, టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. తమ విమానాల్లో వైఫై సేవల కోసం మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌ను కాదని, అమెజాన్‌కు చెందిన 'లియో' శాటిలైట్ వ్యవస్థను ఎంచుకోవడంపై మస్క్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు డెల్టా సీఈవో ఎడ్ బాస్టియన్ తన ఉద్యోగాన్ని కోల్పోతారని హెచ్చరించడం సంచలనం సృష్టిస్తోంది. ఈ వివాదానికి అసలు కారణం డెల్టా సీఈవో ఎడ్ బాస్టియన్, మస్క్ ప్రతిష్టపై చేసినట్లుగా చెబుతున్న కొన్ని వ్యాఖ్యలు. ఒక కంపెనీ కార్యక్రమంలో ఉద్యోగులతో మాట్లాడుతూ.. మస్క్‌తో కలిసి పనిచేయడానికి తాము ఇష్టపడలేదని బాస్టియన్ అన్నట్లు ఏవియేషన్ రిపోర్టర్ ఒకరు వెల్లడించారు. "మస్క్ ప్రతిష్ఠ గురించి మీకు తెలిస్తే, ఆయన గురించి బయట చెప్పేవన్నీ నిజాలే" అని బాస్టియన్ వ్యాఖ్యానించినట్లు ఆ రిపోర్ట్ పేర్కొంది. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవడంతో మస్క్ దృష్టికి వెళ్లాయి. దీనిపై ఆయన ఘాటుగా స్పందించారు. 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ.. "ఈ నిర్ణయం వల్ల బాస్టియన్ తన ఉద్యోగాన్ని కోల్పోతారు" అని హెచ్చరించారు. అంతటితో ఆగకుండా డెల్టా కనెక్టివిటీపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. స్టార్‌లింక్ కనెక్టివిటీ లేనందున, ఒక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వ్యవస్థను బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా చేయాలంటే దాన్ని డెల్టా విమానంలో ఉంచడమే సరైన మార్గమని చురక అంటించారు. ఈ నిర్ణయం వల్ల డెల్టా గణనీయమైన సంఖ్యలో కస్టమర్లను కోల్పోవచ్చని ఆయన గతంలోనే హెచ్చరించారు. గత మార్చి నెలలో డెల్టా ఎయిర్‌లైన్స్, అమెజాన్‌తో బహుళ-సంవత్సరాల ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం 2028 నుంచి దశలవారీగా 500 విమానాల్లో అమెజాన్ 'లియో' శాటిలైట్ ఆధారిత వైఫై సేవలను ప్రారంభించనుంది. అయితే, యునైటెడ్ ఎయిర్‌లైన్స్ వంటి అనేక ప్రత్యర్థి సంస్థలు ఇప్పటికే తమ విమానాల్లో వేగవంతమైన స్టార్‌లింక్ సేవలను అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో డెల్టా నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. అయితే, తమ నిర్ణయాన్ని డెల్టా సమర్థించుకుంటోంది. ఇది కేవలం వైఫై ఒప్పందం మాత్రమే కాదని, అమెజాన్‌తో తమకున్న విస్తృత భాగస్వామ్యంలో భాగమని స్పష్టం చేసింది. డెల్టా ఇప్పటికే తమ 600 అప్లికేషన్ల కోసం 'అమెజాన్ వెబ్ సర్వీసెస్' (ఏడబ్ల్యూఎస్)ను వినియోగిస్తోంది. భవిష్యత్తులో అమెజాన్ క్లౌడ్, రిటైలింగ్, ప్రైమ్ వీడియో, గేమింగ్ టెక్నాలజీ వంటి సేవలను కూడా ప్రయాణికులకు అందించేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని వివరిస్తోంది. అయినప్పటికీ, డెల్టా నిర్ణయంపై విమర్శలు వస్తున్నాయి. మస్క్ స్టార్‌లింక్ ఇప్పటికే వేలాది శాటిలైట్లతో పూర్తిస్థాయి నెట్‌వర్క్‌ను కలిగి ఉండగా, అమెజాన్ 'లియో' ప్రాజెక్ట్ ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. స్టార్‌లింక్‌తో పోలిస్తే అమెజాన్ శాటిలైట్ల సంఖ్య చాలా తక్కువ. ఈ నేపథ్యంలో నిరూపితమైన టెక్నాలజీని కాదని, ఇంకా అభివృద్ధి దశలో ఉన్న వ్యవస్థను ఎంచుకోవడం సరైన వ్యూహం కాదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, అమెజాన్‌తో భాగస్వామ్యం ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయని డెల్టా ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ టెక్ యుద్ధంలో ఎవరి వ్యూహం ఫలిస్తుందో కాలమే నిర్ణయించాలి.

## వైఎస్ జగన్‌ను కలిసిన లంకపల్లి రైతులు

తాడేపల్లి : కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గం, పమిడిముక్కల మండలం లంకపల్లి గ్రామానికి చెందిన రైతులు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. తమ గ్రామ పరిధిలోని సుమారు 600 ఎకరాల లంక భూములకు సంబంధించి తీవ్ర అవకతవకలు చోటు చేసుకున్నాయని వైఎస్ జగన్ దృష్టికి తీసుకువచ్చారు రైతులు. 1952 నుంచి ఆ భూములను సాగు చేసుకుంటున్న రైతులమైన తమను పక్కనపెట్టి, స్థానిక టీడీపీ నాయకులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై టీడీపీ నాయకులు, వారి బినామీల పేర్లతో అనధికారికంగా పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమ హక్కులను కాదని, రాజకీయ ప్రాబల్యంతో భూములను ఇతరుల పేర్లకు మార్చి వారి పేరుతో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ చేశారని వైఎస్ జగన్‌కు ఫిర్యాదు చేశారు సదురు రైతులు. లంక భూముల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. తమకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ అండగా నిలవాలని వైఎస్ జగన్‌ను కోరారు రైతులు. రైతుల సమస్యలను, వారి ఆవేదనను విన్న వైఎస్ జగన్.. వారికి అవసరమైన న్యాయం సహాయం పార్టీ తరఫున అందిస్తామని భరోసా ఇచ్చారు. బాధిత రైతులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## ఇండి కూటమి భేటీలో
## దేశ వ్యాప్తంగా నిరసనలకు నిర్ణయం

ఢిల్లీ: ఢిల్లీలో ఇండి కూటమి సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎన్నికల సంఘం పనితీరు, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై చర్చించేందుకు ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఈ సమావేశం జరిగింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించేందుకు పార్లమెంట్‌లో తీర్మానం ప్రవేశపెట్టే నోటీసు ముసాయిదాపై కూటమి చర్చించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "అక్టోబర్ 2 నుంచి 8 వరకు ఇండి కూటమి నేతలం జిల్లా, కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడతాం. అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం వరకు పాదయాత్ర నిర్వహిస్తాం. సంస్థలను ఏ విధంగా స్వాధీనం చేసుకుంటున్నారో రాష్ట్రపతికి తెలియజేయడానికి ప్రతిపక్ష నాయకులం అందరం అక్టోబర్ రెండవ వారంలో కలవడానికి అపాయింట్‌మెంట్ కోరుతాం. అక్టోబర్-నవంబర్ నెలల్లో దేశవ్యాప్తంగా ఐదు ప్రధాన ర్యాలీలు నిర్వహిస్తాము. ర్యాలీల తేదీలు, వేదికలను త్వరలోనే ఖరారు చేస్తాము. నవంబర్ 1న ఢిల్లీలో ఒక భారీ ర్యాలీని నిర్వహిస్తాం. ఓటు చోరీపై రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ చెప్పే మాటలను ఇప్పుడు అందరూ అంగీకరిస్తున్నారు" అని తెలిపారు. కాగా, ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిలిపివేయాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఓటరు జాబితాల నుంచి పేర్లు తొలగించిన అంశంపై పూర్తి స్థాయి దర్యాప్తు చేయాలని ఇండి కూటమి నేతలు కోరుతున్నారు. కూటమిలో 21 పార్టీలు పాల్గొన్నాయి. గతంలో 23 పార్టీలుగా ఉన్న ఇండి కూటమి నుంచి డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ సమావేశానికి దూరంగా ఉన్నాయి. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సమావేశానికి హాజరుకావడం కాలేదు. ఆయన స్థానంలో ఎంపీలు హరేంద్ర మాలిక్, మొహిబ్బుల్లా నద్వీ పాల్గొన్నారు. సమావేశానికి డీఎంకే దూరంగా ఉన్నప్పటికీ, జ్ఞానేశ్ కుమార్‌పై పార్లమెంట్‌లో తొలగింపు తీర్మానం వస్తే మద్దతు ఇస్తామని ఆ పార్టీ ప్రతినిధి టీకేఎస్ ఎలంగోవన్ తెలిపారు.

## ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలు..
## సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

అమరావతి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఈ నెల 11 నుంచి 20 వరకు జరగనున్న దసరా మహోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి ప్రసాదాన్ని అందించి, వేదాశీర్వచనం పలికారు. దసరా ఉత్సవాల ఏర్పాట్లపై చంద్రబాబు ఆరా తీశారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుర్గగుడి ధర్మకర్తల మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఆలయ ఈవో శీనా నాయక్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులపై దుమారం..
## కాంగ్రెస్‌ను నిలదీసిన కవిత

హైదరాబాద్: తెలంగాణలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థుల విషయంలో కాంగ్రెస్ పార్టీపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలనూ రెడ్డి సామాజిక వర్గానికే కేటాయించడం పూర్తి సామాజిక అన్యాయమని ఆమె ఆరోపించారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని, నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది. ఈ ఇద్దరు అభ్యర్థులు రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారే కావడంతో రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ నిర్ణయంపై సోషల్ మీడియా వేదికగా కవిత స్పందించారు. "రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సీట్లు... రెండు చోట్లా రెడ్డి నేతలకే టికెట్లు... ఇది పూర్తి సామాజిక అన్యాయం కాదా?" అని ఆమె ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో బలహీన వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉంటుందని, కేవలం ఒకే వర్గానికి ప్రాధాన్యం ఇవ్వడం తెలంగాణ ఆత్మగౌరవానికి విరుద్ధమని ఆమె పేర్కొన్నారు.

## కిటకిటలాడుతున్న తిరుమల గిరులు..
## సర్వదర్శనానికి పోటెత్తిన భక్తులు..

తిరుపతి: తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. క్యూలైన్లు కాంప్లెక్స్ వెలుపలి వరకు విస్తరించడంతో తిరుమల గిరులు భక్తజనసందోహంతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని తలపిస్తున్నాయి. దర్శన టికెట్లు లేని సాధారణ భక్తులకు శ్రీవారి సర్వదర్శనం కోసం సుమారు 24 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షిస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ సిబ్బంది, శ్రీవారి సేవకులు నిరంతరం సేవలందిస్తున్నారు. భక్తులకు అన్నప్రసాదం, మంచినీరు, పాలు పంపిణీ చేయడంతో పాటు అవసరమైన వారికి వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారు. మంగళవారం ఒక్కరోజే 77,082 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు టీటీడీ గణాంకాలు వెల్లడించాయి. వీరిలో 34,039 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.22 కోట్లుగా నమోదైంది. భక్తుల రద్దీ దృష్ట్యా అందరూ సంయమనం పాటించి, క్షేత్రస్థాయి సిబ్బందికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## నా ఆస్తులు రూ.1,400 కోట్లు,
## అన్నీ చట్టబద్ధమే: డీకే శివకుమార్

కర్ణాటక : తన ఆస్తుల విషయంలో కేంద్ర మంత్రి హెచ్.డి.కుమారస్వామి చేస్తున్న ఆరోపణలపై కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఘాటుగా స్పందించారు. తన ఆస్తులన్నీ చట్టబద్ధంగా సంపాదించినవేనని, ఆదాయపు పన్ను శాఖకు అన్ని వివరాలు వెల్లడించానని స్పష్టం చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, కుమారస్వామిపై ఎదురుదాడికి దిగారు. "అవును, ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నాకు రూ.1,400 కోట్ల ఆస్తులు ఉన్నాయి. అవన్నీ చట్టపరిధిలోనే సంపాదించాను. కుమారస్వామి నిరాశ, నిస్పృహలతో ఇలా మాట్లాడుతున్నారు" అని శివకుమార్ అన్నారు. బీజేపీ-జేడీఎస్ కూటమిలో నెలకొన్న అంతర్గత విభేదాలే కుమారస్వామి అసహనానికి కారణమని ఆయన ఆరోపించారు. నైస్ ప్రాజెక్టుపై కుమారస్వామిని శివకుమార్ నిలదీశారు. "ఆయన తండ్రి హెచ్.డి.దేవెగౌడ ఆ ప్రాజెక్టు ఒప్పందంపై సంతకం చేశారు. కుమారస్వామి కూడా ముఖ్యమంత్రిగా పనిచేశారు. అప్పుడు ఈ విషయంపై ఎందుకు మౌనంగా ఉన్నారు? గాంధీ అనే వ్యక్తికి టెండర్ కట్టబెట్టాలని ప్రయత్నించి, కోర్టుతో మొట్టికాయలు కూడా తిన్నారు. బినామీ పేర్లతో ఎన్నో లావాదేవీలు జరిగాయి. ఆయనలా నేను పేర్లు చెప్పాలనుకోవడం లేదు" అని విమర్శించారు. ఒక రైతు కుమారుడిగా, పారిశ్రామికవేత్తగా తాను ఆస్తులు సంపాదించడంలో తప్పేంటని శివకుమార్ ప్రశ్నించారు. "నాకు ఆస్తులు ఉండకూడదా? నా పిల్లలు ఆస్తులు కొనకూడదా? చట్టం అనుమతించిన మేరకే అన్నీ చేశాను. కుమారస్వామి ఏమైనా ఐటీ అధికారా? ఆయన దగ్గర సమాచారం ఉంటే ఆదాయపు పన్ను శాఖకు ఇవ్వమనండి" అని సవాల్ విసిరారు. బెంగళూరు-మైసూరు ఇన్ఫ్రాస్ట్రక్చర్ కారిడార్ (నైస్ రోడ్), బిడది టౌన్‌షిప్ ప్రాజెక్టుల పరిధిలో కుమారస్వామి, ఆయన కుటుంబ సభ్యులకు ఆస్తులు ఉన్నాయా? అని ఆయన ప్రశ్నించారు. శోభా డెవలపర్స్‌లో రూ.5 కోట్లు పెట్టుబడి పెట్టి దాని విలువను రూ.2,000 కోట్లకు పెంచారన్న ఆరోపణలను కూడా శివకుమార్ తోసిపుచ్చారు. "దివంగత మాజీ సీఎం ఎస్.బంగారప్ప హయాంలో రూ.99,000కు ఒక స్థలం కొన్నాను. ఈ రోజు దాని విలువ రూ.20 కోట్లు. ఇందులో తప్పేముంది? నేను లంచం తీసుకున్నానా? ఏదైనా స్కామ్‌లో దొరికానా? అలాంటిదేమీ జరగలేదు. నాకు ఇలాంటి వందల ఆస్తులున్నాయి" అని వివరించారు. విధానసౌధ మెట్లపై చర్చకు రావాలన్న కుమారస్వామి సవాల్‌పై స్పందిస్తూ, చర్చ జరగాల్సింది అసెంబ్లీలో అని, కావాలంటే ఫ్రీడమ్ పార్క్‌లో బహిరంగ చర్చ పెట్టుకోవచ్చని సూచించారు. దేశవ్యాప్తంగా టోల్‌లను రద్దు చేయాలని ప్రధాని మోదీని కోరే దమ్ము కుమారస్వామికి ఉందా? అని ప్రశ్నించారు. "ఆరోపణలు పార్ట్ 1 మాత్రమేనన్న వ్యాఖ్యలకు, బెదిరింపులకు, స్టింగ్ ఆపరేషన్లకు భయపడను. స్వామీజీల ఫోన్లనే ట్యాప్ చేసిన వారు నన్ను వదులుతారా? ఆయన సీఎంగా ఉన్నప్పుడే నేను భయపడలేదు, ఇప్పుడు భయపడతానా? మా ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను వారు తట్టుకోలేకపోతున్నారు. అసూయకు మందు లేదు" అని శివకుమార్ అన్నారు. తన ఆస్తుల వివరాలన్నీ ఎన్నికల కమిషన్, ఈడీ వద్ద ఉన్నాయని, ఏ పెద్ద ఏజెన్సీతోనైనా దర్యాప్తు చేయించుకోవడానికి తాను సిద్ధమని స్పష్టం చేశారు.

## దక్షిణాది రాష్ట్రాల్లో
## ఏపీ అగ్ర స్థానంలో ఉంది

మొదటి పేజి తరువాయి

ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ, అన్నక్యాంటీన్లు, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం, సంక్షేమ హాస్టళ్లలో వసతులు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు కెపాసిటీ బిల్డింగ్, నైపుణ్య శిక్షణలో దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీ అగ్ర స్థానంలో ఉందని సీఎం చెప్పారు. ఐగాట్ కర్మ యోగి ద్వారా వివిధ కోర్సుల్లో శిక్షణ ఇప్పించామని... రియల్ టైమ్‌లో పని చేసేలా ఉద్యోగులు శిక్షణ పొందుతున్నారన్నారు. వివిధ వర్చువల్ కోర్సుల ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఐఏఎస్ అధికారులు ఎప్పటికప్పుడు ఓరియేంటేషన్ తీసుకుంటూ స్కిల్స్ అప్‌గ్రేడ్ చేసుకుంటారో... అదే తరహాలో ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి ఉండాల్సిందేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగులకు అవసరమైన నైపుణ్య శిక్షణ కోసం ఐఐటీ, ఐఐఎంలతో శిక్షణ ఇప్పించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక తాగునీటి సమస్యను నివారించే విషయంలో ఎంత మాత్రం నిర్లక్ష్యం వహించొద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమీక్ష సందర్భంగా పట్టణాల్లో తాగునీటి సరఫరా ఎలా ఉందని అధికారులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కాలంలో వర్షాలు పడడంతో పట్టణాల్లో తాగునీటి సమస్య చాలా వరకు తగ్గిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. రాయలసీమలో రెండు మున్సిపాల్టీల్లో కొద్దిపాటి తాగునీటి సమస్య ఉందని.. దాన్ని అధిగమించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక విశాఖ నగరంలో కూడా గ్రౌండ్ వాటర్ రీఛార్జ్ అయిందని.. తాగునీటి సమస్యను అధిగమిస్తున్నామని అధికారులు వివరించారు. పట్టణాల్లో కానీ.. పల్లెల్లో కానీ తాగునీటి సమస్య ఉత్పన్నం కాకూడదని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. వర్షాలు పడ్డాయని నిర్లక్ష్యంతో ఉండొద్దని సూచించారు. ప్రభుత్వం చేపట్టే వివిధ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వాములను చేయాలని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ సమావేశంలో సీఎస్ సాయి ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

## ఆసియా క్రీడల్లో ఆర్చర్ చికితకు ఒకేరోజు
## రెండు స్వర్ణాలు.. సీఎం రేవంత్ రెడ్డి అభినందన

హైదరాబాద్: ఆసియా క్రీడల్లో ఒకే రోజు రెండు స్వర్ణ పతకాలు సాధించి సత్తా చాటిన తెలంగాణ ఆర్చరీ క్రీడాకారిణి తానిపర్తి చికితా రావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. తన అద్భుత విజయంతో చికిత తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిందని, రాష్ట్ర ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిందని కొనియాడారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేస్తూ, చికిత పట్టుదల, నిరంతర సాధన, దృఢ సంకల్పం యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఆమె ప్రతిభను గుర్తించి వెన్నంటి నిలిచిన తల్లిదండ్రులకు, శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు కూడా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన చికిత.. ఆసియా క్రీడల్లో కాంపౌండ్ ఉమెన్స్ టీమ్, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో స్వర్ణ పతకాలను కైవసం చేసుకుంది. ముఖ్యంగా, మిక్స్‌డ్ టీమ్‌లో తన భాగస్వామి సాహిల్ జాదవ్‌తో కలిసి సాధించిన ఈ విజయంతో ఆమె 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం విశేషం. ఈ విజయం తెలంగాణ క్రీడా రంగంలో నూతనోత్సాహాన్ని నింపింది.

## మహిళల కోసం భవిష్యత్తులో ఏసీ బస్సులు కొంటాం

విజయవాడ: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. విజయవాడలో నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "డబుల్ ఇంజిన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది. 26,401 మందికి ఇళ్ల పట్టాలు అందిస్తున్నాం. గత వైకాపా పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం. కొందరు నేతలు మీ భవిష్యత్తుతో ఆటలాడుకున్నారు. గత ప్రభుత్వం భూ సర్వే పేరుతో ప్రతి ఊరిలో వివాదాలు సృష్టించింది. మీ ఆస్తులపై, పాస్‌బుక్‌లపై వారి బొమ్మలు వేసుకున్నారు. మేం మాత్రం ప్రభుత్వ రాజముద్రతో పాస్‌బుక్‌లు, పట్టాలు ఇస్తున్నాం. వైకాపా పాలనకు, కూటమి ప్రభుత్వ పాలనకు తేడా గమనించాలి. మొన్న విశాఖలో, నిన్న మంగళగిరిలో నేడు విజయవాడలో పేదలకు పట్టాలు ఇవ్వడం జీవితంలో మర్చిపోలేను. మొత్తం 60 వేల మందికి పట్టాలు ఇచ్చాం. దీని విలువ సుమారు రూ.52 వేల కోట్లు. ఇవాళ పేదల ఆత్మగౌరవానికి పట్టాభిషేకం జరుగుతోంది. పేదల చిరకాల వాంఛ నెరవేర్చాం. వారు ఆనందంగా ఉండటమే నిజమైన అభివృద్ధి. ఈ ఆస్తిని అమ్ముకోవద్దు, భవిష్యత్తు కోసం ఉంచుకోండి. 108 ఏళ్ల నుంచి ఉన్న సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నాం. పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే మూడు పార్టీలు కలిశాయి. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నాం. మహిళల కోసం భవిష్యత్తులో ఏసీ బస్సులు కొంటాం" అని సీఎం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సత్యకుమార్, నాదెండ్ల మనోహర్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి
## త్వరగా అనుమతులు ఇప్పించాలి

మొదటి పేజి తరువాయి

బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి ఢిల్లీలో జల్ శక్తి మంత్రి పాటిల్ గారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ ం152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి ం కోరారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ఆధారంగా నీటిని ఎల్లంపల్లికి తరలించేందుకు వీలుంటుందని వివరించారు. దాంతో నీటి తరలింపునకు అవసరమయ్యే విద్యుత్తు వినియోగం, విద్యుత్తు వ్యయం తగ్గుతుందని పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు , గౌరవెల్లి రిజర్వాయర్‌కు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పర్యావరణ అనుమతులకు మార్గదర్శకాలను జారీ చేస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ఆయా ప్రాజెక్టులకు వెంటనే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కోరారు. అనుమతుల జాప్యంతో ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని తెలిపారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలని ముఖ్యమంత్రి గారు విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించామని, నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు తాము చర్చిస్తున్నామని తెలిపారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఆధ్వర్యంలో చేపడుతున్న టెలిమెట్రీ యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని పాటిల్ ని ముఖ్యమంత్రి కోరారు. మొదటి దశ టెలిమెట్రీ యంత్రాల ఏర్పాటుకు అవసరమైన రూ. 4.15 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మొదటి దశ టెలిమెట్రీ యంత్రాలను ఏర్పాటు చేయడంతో పాటు రెండు, మూడో దశలకు సంబంధించిన యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు.

## రబీ సీజన్ కు పంటల మద్దతు ధర
## పెంపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం

ఢిల్లీ: కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఢిల్లీలో స్మార్ట్ ట్రాఫిక్‌కు కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఢిల్లీలో ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా మార్చేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. రూ.1,789.52 కోట్ల అంచనా వ్యయంతో ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలుకు ఆమోదం తెలిపింది. ఢిల్లీలోని 42 ప్రధాన ట్రాఫిక్ కారిడార్లను మూడు దశల్లో 24 నెలల్లో ఈ వ్యవస్థ పరిధిలోకి తీసుకురానున్నారు. ఏఐ ఆధారిత అడాప్టివ్ ట్రాఫిక్ సిగ్నల్స్, రియల్‌టైమ్ ట్రాఫిక్ సమాచారం, ఆటోమేటెడ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అందుబాటులోకి తెస్తారు. అంబులెన్సులు, అత్యవసర వాహనాలకు గ్రీన్ కారిడార్ సౌకర్యం కల్పించనున్నారు. ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదాలను రియల్‌టైమ్‌లో గుర్తించి వేగంగా స్పందించేలా వ్యవస్థను రూపొందించనున్నారు. రాంగ్ రూట్, స్పీడింగ్, రెడ్‌లైట్ జంపింగ్, హెల్మెట్, సీట్‌బెల్ట్ ఉల్లంఘనలను టెక్నాలజీతో గుర్తించనున్నారు.

కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు

రబీ సీజన్ కు పంటల మద్దతు ధర పెంపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం, 2027-28 మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి ఆరు రబీ పంటల కనీస మద్దతు ధరలను (మీస్రా) పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. కుసుమకు అత్యధికంగా క్వింటాల్‌కు రూ.675, ఆవాలు-రాప్‌సీడ్‌కు రూ.413 చొప్పున పెంచింది. మసూర్ పప్పుకు రూ.390, బార్లీకి రూ.136, శనగకు రూ.83, గోధుమకు రూ.25 పెంపు లభించింది. పెరిగిన ధరలతో గోధుమ మీస్రా రూ.2,610, శనగ రూ.5,958, మసూర్ రూ.7,390, ఆవాలు రూ.6,613, కుసుమ రూ.7,215, బార్లీ రూ.2,286కు చేరింది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడం లక్ష్యమని కేంద్రం వెల్లడి. గ్రీన్ ఎనర్జీ కారిడార్-3కు కేంద్ర కేబినెట్ ఆమోదం. రూ.1,86,405 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ పథకం ద్వారా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 135 గిగావాట్ల వరకు పునరుత్పాదక విద్యుత్‌ను గ్రిడ్‌లోకి అనుసంధానం. 50 గిగావాట్ అవర్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ ఏర్పాటు . 2032-33 ఆర్థిక సంవత్సరం నాటికి పథకాన్ని పూర్తి చేయాలని లక్ష్యం. కేంద్ర ఆర్థిక సాయం రూ.54,082 కోట్లు. విద్యుత్ ప్రసార ఖర్చులను తగ్గించడంతో పాటు పునరుత్పాదక ఇంధన వినియోగం పెంచేందుకు ఈ పథకం దోహదం.

## కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ
## ప్రచారం జరుగుతున్న వేళ... మల్లు భట్టి కీలక వ్యాఖ్యలు!

హైదరాబాద్: వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు


రామ్మోహన్‌రెడ్డి


సర్వోత్తమ్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ శాసనమండలికి త్వరలో జరగనున్న పట్టభద్రుల కోటా ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ఖరారు చేసింది. మహబూబ్ నగర్--రంగారెడ్డి --హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గానికి సామ రామ్మోహన్ రెడ్డి, వరంగల్--ఖమ్మం--నల్లగొండ పట్టభద్రుల స్థానానికి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని ఎంపిక చేశారు. వీరి ఎంపికకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అధికారికంగా ప్రకటించారు. ఈమేరకు ఢిల్లీలోని ఏఐసీసీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. సామ రామ్మోహన్ రెడ్డి స్వస్థలం రంగారెడ్డి జిల్లా. ఈయన టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్ ఛైర్మన్‌గా, ముఖ్య అధికార ప్రతినిధిగా పని చేశారు. రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా, అలాగే యూత్ కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధిగా పని చేశారు. 2017లో లీగల్ సెల్ ఉపాధ్యక్షుడిగా, 2019లో అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహించారు. రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిది సూర్యాపేట జిల్లా. ఈయన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు. యూత్ కాంగ్రెస్ రాజకీయాల్లో చురుకుగా ఉన్నారు. నల్లగొండ జిల్లాలోనూ పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా వ్యవహరించారు. ఏఐసీసీ మెంబర్ అయిన సర్వోత్తమ్ రెడ్డి యూత్ కాంగ్రెస్‌లో పలు హోదాల్లో పనిచేశారు.

# వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

## పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**పరిగి పిఎసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, మున్సిపల్ చైర్పర్సన్ కుడుముల రజిత వెంకటేష్, వైస్ చైర్మన్ బద్రి గారి రాజ పుల్లారెడ్డి పిఎసిఎస్ డైరెక్టర్లు, పరిగి మండల రైతులు తో కలసి జనరల్ బాడీ సమావేశం జరిగింది ముఖ్య అతిథిగా పరిగి శాసనసభ్యులు టి రామ్మోహన్ రెడ్డి హాజరైనారు**



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పట్టణంలోని పిఎసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, వైస్ చైర్మన్ బద్రి గారి రాజ పుల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పిఎసిఎస్ జనరల్ బాడీ సమావేశానికి పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ టి.రామ్మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పిఎసిఎస్ కార్యకలాపాలు,రైతులకు అందుతున్న సేవలు, సహకార సంఘాల ద్వారా చేపడుతున్న



కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ..రైతులకు అవసరమైన సేవలు మరింత మెరుగ్గా అందేలా సహకార సంఘాలు పనిచేయాలని సూచించారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరంగా కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రజిత వెంకటేష్, పిఎసిఎస్ డైరెక్టర్లు సత్యనారాయణ రెడ్డి, పర్శ మోని చిన్న నరసింహులు, రహీం పటేల్, మల్లేష్, హరి చందర్, వెంకటేష్, నాగవర్ధన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రాములు, పట్టణ మాజీ అధ్యక్షులు కృష్ణ, డిసిసి ప్రధాన కార్యదర్శి (నస్కల్) దండు అశోక్, డిసిసి ఉపాధ్యక్షులు లాలు కృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాలాది శ్రీనివాస్ గుప్తా, శాంతు కుమార్, చంద్రయ్య,సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పరిగి మున్సిపాలిటీ 8వ వార్డులో:- కొత్త వీధి దీపాల ఏర్పాటు



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పరిగి మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు కౌన్సిలర్ హబీబునిస్సా అయ్యూబ్ ఆధ్వర్యంలో వార్డులో కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేయడం జరిగింది. వీధుల్లో వెలుతురు సక్రమంగా ఉండేలా, రాత్రివేళ ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన ప్రాంతాల్లో కొత్త లైట్లను ఏర్పాటు చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి, వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని, వార్డులో ఇలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కౌన్సిలర్ హబీబునిస్సా అయ్యూబ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హనుమంతు కమల్, వడ్డె అంజి ముజామ్మిల్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుంది

### - పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



వికారాబాద్ జిల్లా పరిగి (మహీ న్యూస్): పూడూరు మండల కేంద్రంలో పిఎసిఎస్ చైర్మన్ పట్లోళ్ల రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పిఎసిఎస్ సర్వసభ్య సమావేశానికి పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పిఎసిఎస్ కార్యకలాపాలు,రైతులకు అందుతున్న సేవలు, సహకార సంఘాల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు.



రైతులకు అవసరమైన సేవలు మరింత మెరుగ్గా అందేలా సహకార సంఘాలు పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పట్లోళ్ల రఘునాథ్ రెడ్డి,వైస్ చైర్మన్, పిఎసిఎస్ సభ్యులు, రైతులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

### -పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పూడూరు మండల కేంద్రంలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మిడషాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి పరిగి



ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన అర్హులైన 26 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున మొత్తం రూ.26,03,016 విలువైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ప్రజాప్రతినిధులు,అధికారులతో కలిసి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి పంపిణీ చేశారు. పూడూరు పిఎసిఎస్ చైర్మన్ రఘునాథ్ రెడ్డి, పూడూరు మండల పార్టీ అధ్యక్షుడు సురేంద్ర ముదిరాజ్, పరిగి ఆత్మ కమిటీ చైర్మన్ కక్కులూరు శ్రీనివాస్ రెడ్డి, పూడూరు మండల తదితర నాయకులు కార్యకర్తలు షాది ముబారక్ కల్యాణ లక్ష్మి లబ్ధిదారులు

## చెల్లాపూర్ రైతువేదికలో రైతుల అవగాహన సదస్సు



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): వికారాబాద్ జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో చెల్లాపూర్ రైతువేదికలో రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలు, రాయితీలు, ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. రైతులకు ఆయిల్‌పామ్ సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు రాయితీలు గురించి వివరించారు. అలాగే బాంబూ మిషన్ ద్వారా వెదురు సాగును చేపట్టి అదనపు ఆదాయం పొందే అవకాశాలను వివరించారు. అదేవిధంగా నీటి కుంటలు, తీగ పందిళ్ల ఏర్పాటుకు 50 శాతం సబ్సిడీ, స్ప్రింక్లర్ మరియు డ్రిప్ సాగు పద్ధతులకు 70 శాతం నుంచి 90 శాతం వరకు సబ్సిడీ అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు సూక్ష్మ సేద్య పద్ధతులను అవలంబించాలని సూచించారు. కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు కూరగాయల విత్తనాలతో పాటు కూరగాయల తోటల ఏర్పాటుకు సబ్సిడీపై నారు మొక్కలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకుని ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో సాగు చేపట్టి అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం పొందాలని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి సత్తార్ సూచించారు.



ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి . సత్తార్, జిల్లా పట్టు పరిశ్రమ అధికారి విజయ్ కుమార్, కొడంగల్ ఉద్యాన అధికారి సురేంద్రనాథ్, ఏవో తులసి, బాబ్యా నాయక్, ఎకోఫామ్ సిబ్బంది, అరకు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే చెల్లాపూర్ గ్రామ సర్పంచ్ రోజా రమేష్, ఈర్లపల్లి గ్రామ సర్పంచ్ వెంకట్ రాములు తో పాటు ఇతర గ్రామాల సర్పంచులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### - పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): గండీడ్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని పలు గ్రామాల్లో గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (ఎస్ ఐ ఆర్) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి గారు ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కలను సాకారం చేస్తామని తెలిపారు. పేదల సంక్షేమం, వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.



అదేవిధంగా కార్యక్రమంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే అందజేశారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లు, స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు తమకు ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనం కల్పించినందుకు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి గారికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు.తమలాంటి నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# సుంకరపాలెంలో పారిశుద్ధ్య పనులు



తాళ్లరేవు, మహి న్యూస్, సెప్టెంబర్ 30.: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెం గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలను పంచాయతీ సిబ్బంది చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి వలీ బాబా పర్యవేక్షణలో గ్రామంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయడంతో పాటు ఆయా ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించి శానిటైజేషన్ చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# సుంకరపాలెంలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

## వర్షాలకు జలమయమైన రోడ్లు.. ఎమ్మెల్యే దాట్లకు బాధితుల వినతి.



తాళ్లరేవు, మహి న్యూస్, సెప్టెంబర్ 30: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెం గ్రామంలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామంలోని పలు ప్రాంతాలు జలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోడ్లపైనే నిలిచిపోతోంది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పాటు ఇళ్ల చుట్టూ నీరు నిలిచి ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి ఇదే పరిస్థితి నెలకొంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులు, గ్రామంలోని పలు అంతర్గత ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని



ప్రాంతాల్లో మురుగునీరు, వర్షపు నీరు కలిసిపోవడంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు తెలిపారు. దుర్వాసనతో పాటు దోమల బెడద కూడా పెరుగుతోందని పేర్కొన్నారు.

### ఎమ్మెల్యే దాట్ల దృష్టికి సమస్య.

గ్రామంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను స్థానిక నాయకులు వేగేశ్న భాస్కర్ రాజు, పెద్దిరెడ్డి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సమస్యను ఎదుర్కొంటున్న బాధితులను వారు నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు వద్దకు తీసుకెళ్లి పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా స్థానికులు గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల వర్షాల సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించారు. వర్షపు నీరు వెళ్లేందుకు సరైన కాలువ వ్యవస్థ లేకపోవడం, ఉన్న మార్గాలు కూడా సక్రమంగా లేకపోవడంతో ప్రతి వర్షాకాలంలో సమస్య తీవ్రరూపం దాల్చుతోందని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యేను కోరారు.

### త్వరలో పరిష్కారానికి చర్యలు.

స్థానికుల సమస్యలను విన్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమస్యను తాత్కాలికంగా కాకుండా భవిష్యత్తులో వర్షాలు కురిసినప్పటికీ నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### గతంలో రూ.40 లక్షల పనులకు ప్రయత్నం.

సుంకరపాలెంలో డ్రైనేజీ సమస్య కొత్తది కాదని, గతంలో కూడా సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. సుమారు రూ.40 లక్షల వ్యయంతో డ్రైనేజీ పనులు చేపట్టేందుకు గతంలో ప్రయత్నించినప్పటికీ, కొంతమంది పనులను అడ్డుకోవడంతో ఆ పనులు ముందుకు సాగలేదని ఎమ్మెల్యే బహిరంగంగా పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతున్న నేపథ్యంలో గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామంలోని జనాభా, భవిష్యత్తులో పెరిగే నిర్మాణాలు, వర్షపాతం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర డ్రైనేజీ ప్రణాళిక రూపొందించాలని కోరుతున్నారు.

### శాశ్వత పరిష్కారం కోసం ఎదురుచూపులు

సుంకరపాలెం గ్రామంలో వర్షాలు కురిసిన ప్రతిసారీ రోడ్లు జలమయం కావడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు రోడ్లపై నిలిచిన నీటిలో రాకపోకలు సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నీరు ఎక్కువ కాలం నిలిచి ఉంటే పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో పరిశీలించి, అవసరమైన చోట కొత్త కాలువలు నిర్మించడం, ఉన్న కాలువలను అభివృద్ధి చేయడం, నీరు సాఫీగా వెళ్లేలా అవుట్‌లెట్ మార్గాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు హామీతో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికార యంత్రాంగం గ్రామంలో పర్యటించి క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలు రూపొందించి పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లరేవు మండల సాగునీటి సంఘం డిస్ట్రిబ్యూటర్ చైర్మన్ వేగేశ్న భాస్కర్ రాజు, పెద్దిరెడ్డి రవికుమార్, నరహరిశెట్టి వీరబాబు, గుంటముక్కల సూరిబాబు, పెద్దిరెడ్డి విఘ్నేశ్వరరావు, మద్రి అశోక్, పోలిశెట్టి చిట్టినాయుడు, పోలిశెట్టి చంటి, కనకాల సత్తిబాబు, మాకిరెడ్డి సత్తిబాబు, కనకాల శ్రీనివాసు, నల్లం నాగబాబు, పోలిశెట్టి రామకృష్ణ,తదితర నాయకులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎస్సీ,ఎస్టీ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు..



కాకినాడ, మహి న్యూస్, సెప్టెంబర్ 30: జిల్లాలో ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కల్పించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయడంతో పాటు అత్యాచార కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం,పరిహారం, పునరావాసం అందేలా అధికారులు సమన్వయం తో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ట్రైనీ కలెక్టర్ ప్రియ ఇతర అధికారులతో కలిసి అత్యాచారాల నిరోధక చట్టం -పౌర హక్కుల పరిరక్షణ చట్టాలు అమలుపై ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జిల్లా స్థాయిలో కమిటీ సభ్యులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో సెప్టెంబర్ 29వరకు నమోదైన ఎస్సీ,ఎస్టీ అత్యాచార కేసుల స్థితిగతులు,బాధితులకు పరిహారం పంపిణీ, పునరావాసం, కేసుల దర్యాప్తు పురోగతి, ఛార్జిషీట్ దాఖలు, కోర్టు కేసుల ప్రస్తుత పరిస్థితి, మాన్యువల్ స్కావెంజింగ్ నివారణ, పారిశుద్ధ్య కార్మికుల పునరావాసం వంటి అంశాలపై ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ సమీక్షించారు.

### ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ...

ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కల్పించిన చట్టాలను బాధితులకు చట్టప్రకారం అందాల్సిన తక్షణ ఉపశమనం,పరిహారం, పునరావాస సహాయం సత్వరంఅందించాలన్నారు. జిల్లాలో 2026 సంవత్సరం లో ఇప్పటివరకు ఈ చట్టం కింద 21 కేసులు నమోదయ్యాయన్నారు. ఈ కేసులకు సంబంధించి బాధితులకు పరిహారం పంపిణీ, పునరావాసం, కేసుల దర్యాప్తు పురోగతి, ఛార్జిషీట్ దాఖలు, కోర్టు కేసుల వంటి అంశాలను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ప్రస్తుత పరిస్థితి పెండింగ్‌లో ఉన్న కేసులను సంబంధిత పోలీస్, రెవెన్యూ, సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యాచారాల కేసుల్లో బాధితులు, సాక్షులకు చట్టపరంగా కల్పించాల్సిన హక్కులు, రక్షణ, న్యాయ సహాయం అందేలా చూడాలన్నారు. కేసుల దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు, న్యాయస్థానాల్లో కేసుల ప్రాసిక్యూషన్ విషయంలో అధికారులు బాధ్యతయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్యుత్, గృహాలు తదితర మౌలిక వసతుల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలు, విద్యా-- ఉపాధి అవకాశాలు సకాలంలో అందించి రాజ్యాంగ రిజర్వేషన్ల ఫలాలు దక్కేలా చూడాలన్నారు. క్రమం తప్పకుండా అన్ని మండలాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి నెలా మొదటి సోమవారం రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఇందుకు పోలీస్, రెవెన్యూ, సాంఘిక, గిరిజన సంక్షేమం తదితర శాఖల అధికారులు సమన్వయం తో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రాముఖ్యంగా జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, రైల్వే స్టేషన్ల పరిధిలో మాన్యువల్ స్కావెంజింగ్ జరగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. సెప్టిక్ ట్యాంకులు, డ్రైనేజీలను శుభ్రపరిచే సమయంలో కార్మికులు నేరుగా లోపలికి దిగకుండా తగిన రక్షణ పరికరాలు (పీపీఈ కిట్లు) తప్పనిసరిగా అందించాలని ఆదేశించారు. ఓపెన్ డిఫెకేషన్ (బహిర్భూమికి వెళ్లడం) ఎక్కడా జరగకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలపై ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత అధికారులపై కఠినమైన శాఖాపరమైన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు చట్టపరంగా అందవలసిన కనీస వేతనాలు,క్రమమైన ఆరోగ్య పరీక్షలు, ఆరోగ్య బీమా, నివాస వసతులు కల్పించాలని సూచించారు. అంతేకాకుండా, కార్మికుల తర్వాతి తరాలు ఉన్నత విద్యను అభ్యసించేలా, వారికి తగిన ఉపాధి నైపుణ్య శిక్షణ అందించే దిశగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై సంబంధిత అధికారులు వచ్చే సమావేశంనాటికి చర్యల నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఇన్చార్జి సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఏ. శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ ఎం. కిషోర్ కుమార్, డీఎంహెచ్వో డా.కె.అనిత ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు కృషి, పట్టుదలతో విజయాలు సాధించాలి

**అవమానాలను అవకాశాలుగా మలుచుకుంటే విజయాన్ని సాధించవచ్చు**

**గ్రామీణ విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉంది**

**తరగతి గదిలో అధ్యాపకుడిగా మారిన మంత్రి పయ్యావుల కేశవ్**



ఉరవకొండ, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే జీవితంలో విజయాలు సాధించవచ్చని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. 'యువత భవిత' కార్యక్రమంలో భాగంగా ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా బీకాం ప్రథమ సంవత్సరం విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి కొంతసేపు అధ్యాపకుడిగా మారి పాఠ్యాంశాలతో పాటు జీవితానికి ఉపయోగపడే పలు విషయాలను బోధించారు. జీవితంలో ఎదురయ్యే అవమానాలు, అపజయాలతో కుంగిపోకుండా వాటినే విజయానికి మెట్లుగా మార్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. తాను కూడా పాఠశాల స్థాయిలో అవమానాన్ని ఎదుర్కొన్న సందర్భాన్ని సవాలుగా తీసుకుని మూడు నెలల్లోనే తన ప్రతిభను నిరూపించుకున్నానని తన అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రతిభలో ఎవరికీ తీసిపోరని, సరైన లక్ష్యం, కష్టపడే తత్వం ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని మంత్రి తెలిపారు. కళాశాలలో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. మంత్రి స్వయంగా తరగతి గదిలో విద్యార్థులతో మమేకమై జీవిత పాఠాలను బోధించడం వారిలో ఉత్సాహాన్ని నింపింది.



# పాఠశాల కమిటీల చైర్మన్లు, సభ్యులతో మంత్రి పయ్యావుల కేశవ్ భేటీ

**నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు**

**పాఠశాలల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలని సూచన**

**విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించాలి**



ఉరవకొండ, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన ప్రభుత్వ పాఠశాల కమిటీల చైర్మన్లు, సభ్యులు బుధవారం ఉరవకొండలోని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ కమిటీల చైర్మన్లు, సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో పిల్లలను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దే దిశగా పాఠశాల కమిటీలు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధితో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందేలా కృషి చేయాలని మంత్రి కోరారు.



# ఉరవకొండలో ప్రజా దర్బార్ నిర్వహించిన

**- మంత్రి పయ్యావుల కేశవ్**

**ప్రజల నుంచి అర్జీల స్వీకరణ**

**సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు**

**ఫోన్ ద్వారా అధికారులతో మాట్లాడిన మంత్రి**



ఉరవకొండ, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): ఉరవకొండ పట్టణంలోని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా, ఉరవకొండ నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు, నాయకుల నుంచి అర్జీలను స్వీకరించిన మంత్రి పయ్యావుల కేశవ్.. సమస్యలను పరిశీలించి, వాటిని వెంటనే పరిష్కరించేలా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు స్పందించాలని సూచించారు.





# రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

**ముగ్గురు మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించిన మంత్రి పయ్యావుల కేశవ్**

**ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని హామీ**



అనంతపురం, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): ఉరవకొండ శివారులోని గుంతకల్లు ప్రధాన రహదారిపై ఈ నెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వజ్రకరూరు గ్రామానికి చెందిన ముగ్గురి కుటుంబాలకు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బుధవారం ఆర్థిక సహాయం అందించారు. ఉరవకొండలోని తన క్యాంపు కార్యాలయంలో జైనుల్లా, మహబూబ్ బాషా, మహమ్మద్ రఫీ కుటుంబ సభ్యులకు సహాయం అందించిన మంత్రి.. ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు.



# ఎస్సీ, ఎస్టీ సమస్యలను సత్వరం పరిష్కరించాలి



అనంతపురం, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): జిల్లాలో ఎస్సీ, ఎస్టీల సమస్యలను పెండింగ్ లేకుండా సత్వరం పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో పోలీసు, రెవెన్యూ, ప్రాసిక్యూషన్ శాఖలు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన న్యాయం, పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాజిక రుగ్మతలను నిర్మూలించేందుకు అధికారులు పారదర్శకంగా, నిబద్ధతతో పనిచేయాలని అన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి నియోజకవర్గాల వారీగా సమీక్షించి పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఎలాంటి పక్షపాతం, జాప్యం లేకుండా విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో డివిఎంసీ సభ్యులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.



# ఉద్యాన పంటల సాగుపై అవగాహన



అనంతపురం, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): జిల్లాలో ఉద్యాన పంటల సాగుపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో బుధవారం ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న మైదానం నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి.సి. ధనుంజయ మాట్లాడుతూ అక్టోబర్ 2న మదనపల్లిలో ప్రారంభం కానున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టు ద్వారా రాయలసీమలోని 10 జిల్లాల రైతులకు ప్రయోజనం కలగనుందని తెలిపారు. సుమారు రూ.లక్ష కోట్ల అభివృద్ధి ప్రణాళికతో ఉద్యాన రంగానికి మరింత ఊతం లభించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సాలు రెడ్డి, ఏపీ ఎంఐపీ ప్రాజెక్టు అధికారి రఘునాథరెడ్డి, జిల్లా సమాచార శాఖ అధికారి బాలకొండయ్య, రైతులు, విద్యార్థులు, వ్యవసాయ--ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది, మైక్రో ఇరిగేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



# రేషన్ పంపిణీలో పారదర్శకత పెంచాలి

**విజిలెన్స్ కమిటీ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ**




గుంటూరు, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): ప్రజా పంపిణీ వ్యవస్థలో లోపాలను సరిదిద్ది, జవాబుదారీతనాన్ని పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. రేషన్ బియ్యం బస్తాలపై క్యూ ఆర్ కోడ్ ఉన్న బస్తాలతో పంపిణీ చేపట్టడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. పట్టణ, గ్రామీణ, రేషన్ షాప్ స్థాయిల్లో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రేషన్ బియ్యం దుకాణాలకు ఆలస్యంగా చేరడంపై సభ్యులు ప్రశ్నించగా, మరోసారి ఇలాంటి ఘటనలు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ హెచ్చరించారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యత లేని, చిన్న కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారన్న ఫిర్యాదులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ఎంఎల్ పాయింట్ల వద్ద తూకాల్లో తేడాలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై అధికారులు చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ కమిటీ సభ్యులు కోరారు. ఈ నెల నుంచి 10 శాతం నూకలు ఉన్న బియ్యం మాత్రమే సరఫరా అవుతుందని, కార్డుదారులు బియ్యాన్ని అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. సమావేశంలో పౌరసరఫరాలు, మార్కెటింగ్, విద్య, శిశు సంక్షేమం, ధరల నియంత్రణ శాఖల అధికారులు, వ్యాపారులు, రైతు సంఘాలు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# కరెంట్ షాక్‌తో మృతి చెందిన సాత్విక్ కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయం



అనంతపురం, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): ఉరవకొండ ఇంద్రనగర్ కాలనీకి చెందిన సోము, మౌనిక దంపతుల కుమారుడు సాత్విక్ ఈ నెల 20న విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో సాత్విక్ తల్లిదండ్రులను రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బుధవారం పరామర్శించారు. ఉరవకొండలోని తన కార్యాలయంలో సాత్విక్ తల్లిదండ్రులకు రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సాత్విక్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు.

# ఉరవకొండలో అసంపూర్తి స్టేడియం భవనాన్ని పరిశీలించిన మంత్రి పయ్యావుల కేశవ్

**క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం**



ఉరవకొండ, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసంపూర్తిగా ఉన్న స్టేడియం భవనాన్ని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బుధవారం పరిశీలించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులతో కలిసి స్టేడియం ప్రస్తుత పరిస్థితి, నిలిచిపోయిన నిర్మాణ పనులు, క్రీడాకారులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసి గ్రామీణ ప్రాంతాల నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. స్టేడియంలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు 2017లో ప్రారంభమైనప్పటికీ, గత ప్రభుత్వ హయాంలో పనులు నిలిచిపోయాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం పునర్నిర్మాణం చేపట్టేందుకు భవన నిర్మాణాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్.ఎం. మంజుల, క్రీడా ప్రాధికార సంస్థ డీఈ, క్రీడా శిక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.



# అమరావతి ఛాంపియన్‌షిప్-2026 విజేత నెల్లూరు

**ఫైనల్లో కడపపై విజయం.. ప్రతిభ చాటిన దివ్యాంగ క్రికెటర్లు**



అనంతపురం, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): రెండో ఎడిషన్ అమరావతి ఛాంపియన్‌షిప్--2026 ఇన్‌క్లూసివ్ సౌత్ జోన్ అంతర్‌జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో నెల్లూరు జట్టు విజేతగా నిలిచింది. అనంతపురంలోని ఆర్‌డీటీ క్రికెట్ మైదానంలో జరిగిన ఫైనల్లో కడపపై విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఫైనల్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కడప జట్టు 20 ఓవర్లలో 68 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 71/6 పరుగులు చేసి విజయం సాధించింది. నెల్లూరు బౌలర్ మనోహర్ ఐదు వికెట్లు తీసుకుని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. అంతకుముందు జరిగిన మ్యాచ్‌లో కర్నూలుపై నెల్లూరు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కర్నూలు 20 ఓవర్లలో 129/9 పరుగులు చేయగా, నెల్లూరు 131/4 పరుగులు చేసి గెలుపొందింది. నెల్లూరు బ్యాటర్ రాఖీ 35 బంతుల్లో 50 పరుగులు చేసి రాణించాడు. ముగింపు కార్యక్రమానికి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీ, బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయిలో దివ్యాంగ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక చేయాలనే లక్ష్యంతో ఈ ఛాంపియన్‌షిప్ నిర్వహించినట్లు అనంతపురం జిల్లా దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి వెన్నపూస రోషిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏసిఏ డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ సభ్యులు యడ్లపల్లి సూర్యనారాయణ, అనంతపురం దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. శంకర్ నారాయణ, డా. కుమార్, డా. సాయి, డీసీసీఐ సౌత్ ఇండియా కోఆర్డినేటర్ మధుసూదన్ నాయక్, డీసీసీఏపీ జాయింట్ సెక్రటరీ గండా కైలాసరెడ్డి, కొండా సత్య వరప్రసాద్, డీసీఏఏ అడ్మిన్ బి. నాగరాజు, నూరుల్ హుదా, జి. తేజ తదితరులు పాల్గొన్నారు.

# బంధిత కార్మికుల గుర్తింపు.. స్వగ్రామాలకు తరలింపు

**93 మంది బాధితుల గుర్తింపు.. ఆర్టీసీ బస్సులో స్వగ్రామాలకు తరలింపు**



అనంతపురం, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): విశ్వసనీయ సమాచారం మేరకు బొమ్మనహాల్, డి.హీరేహాల్ మండలాల్లో అధికారులు బంధిత కార్మికుల గుర్తింపు, రక్షణ కోసం బుధవారం తనిఖీలు నిర్వహించారు. రెవెన్యూ, ఐసీడీఎస్ శాఖల సమన్వయంతో చేపట్టిన చర్యల్లో మొత్తం 93 మంది బాధితులను గుర్తించారు. బొమ్మనహాల్ మండలంలో 11 కుటుంబాలకు చెందిన 38 మంది, అందులో 25 మంది పెద్దలు, 13 మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించారు. డి.హీరేహాల్ మండలంలో 14 కుటుంబాలకు చెందిన 55 మంది, అందులో 35 మంది పెద్దలు, 20 మంది పిల్లలను గుర్తించారు. గుర్తించిన బాధిత కుటుంబాలను సురక్షితంగా వారి స్వగ్రామాలకు తరలించేందుకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేశారు. బాధితుల భద్రతకు అవసరమైన చర్యలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టారు.



# కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి ఏఐ శిక్షణ

**పరిపాలనలో ఏఐ వినియోగం పెరగాలి: జిల్లా కలెక్టర్**



శ్రీకాకుళం, మహి న్యూస్, సెప్టెంబరు 30:: పరిపాలనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగించడం ద్వారా పని సులభతరం కావడమే కాకుండా వేగవంతమవుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో టైపిస్టులు, జూనియర్ సహాయకులు, సీనియర్ సహాయకులు, సెక్షన్ సూపరింటెండెంట్లు తదితర పరిపాలనా సిబ్బందికి ఏఐ పరిజ్ఞానంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కృత్రిమ మేధ (ఏఐ) యాప్‌ల ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలను ఏ విధంగా తయారు చేయాలి? కార్యాలయ సాధారణ పరిపాలనలో వీటిని ఏ విధంగా ఉపయోగించాలి? ఏ ఏ విభాగాల్లో దీన్ని అన్వయించవచ్చు? అనే విషయాలను ఉదాహరణలతో సహా వివరిస్తూ, సిబ్బందిచే ప్రాక్టీస్ చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుంటూ పనితీరును మెరుగుపరచుకోవాలని సూచించారు. కార్యాలయాల్లో పని ఒత్తిడిని తగ్గించుకోవడానికి ఈ సాంకేతికత ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలకు మరింత మెరుగ్గా, వేగవంతంగా సేవలు అందించడానికి ప్రతి ఒక్కరూ తగిన శిక్షణ పొంది నిరంతరం ప్రాక్టీస్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ హరిఓం పాండ్యా, డీఆర్ఓ విశ్వేశ్వరరావు, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ ఇంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ముంపు నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న ఆక్రమణ లనువెంటనేతొలగించాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్**

కాకినాడ, మహి న్యూస్, సెప్టెంబర్ 30: ?పంట కాలువలు,డ్రైనేజీ లపై ఉన్న ఆక్రమణలను నిబంధనల ప్రకారం గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీ కరించి వెంటనే తొలగించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ వాచ్ డాగ్ పర్యవేక్షణ కమిటీ సభ్యులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు ఏలేరు, గోదావరి ఈస్ట్రన్, ఇరిగేషన్ డివిజన్లు, మరియు జిల్లా డ్రైనేజీ డివిజన్ ఇంజనీర్లు, పంచాయతీ అధికారులతో వాచ్ డాగ్ పర్యవేక్షణ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... అక్టోబర్ నెల అంతా రోజు విడిచి రోజు మూడు ఇరిగేషన్ డివిజన్లలో విస్తృతంగా పర్యటిస్తానని తద్వారా ముంపు నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న ఆక్రమణ లనుగుర్తించితొలగించడానికి చర్యలు గై కొనడం జరుగుతుందన్నారు. అక్టోబర్ నెలాఖరు నాటికి వరి పంటలు కోతకు రాను న్నందున,క్షేత్రస్థాయిలో ఇంజనీర్లు పర్యటిస్తూ రైతులకు పంట నష్టం జరగకుండా ముంపు నీరు సులువుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని జలవనరులు డ్రైనేజీ విభాగపు ఇంజనీర్ల ను ఆదేశించారు... పిఠాపురం,గొల్లప్రోలు ప్రాంతాల పై ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నా రు.? అన్నవరం,తాళ్లరేవుల్లో ఆక్రమణల తొలగింపుకు అవసర మైతే డిఎస్పి ఆధ్వర్యం లో పోలీసు బలగాలను మోహరించి ఆక్రమణలను పూర్తిగా తొలగించాలన్నారు. రెవెన్యూ,పంచాయతీరాజ్, మున్సిపల్, ఇరిగేషన్, పోలీసు శాఖలు సమన్వయంతో నిబంధనల మేరకు చట్ట ప్రకారం నోటీసులు జారీ చేసిన అనంతరమే తొలగింపుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆక్రమణల తొలగింపుతో పాటు కాలువల్లో పూడిక తీత, చెత్త తొలగింపు పనులు చేపట్టాలన్నారు. ఒకసారి ఆక్రమణలను తొలగించిన ప్రాంతాల్లో తిరిగి ఆక్రమణలు జరగకుండా కమిటీ నిరంతరం పర్యవేక్షించాలన్నారు. డ్రైనేజీ సమస్యలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు మండల మున్సిపాలిటీ వారీగా ఆక్రమణల తొలగింపుపై నివేదికలు సిద్ధం చేయాలన్నా రు ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పేనాయక్, పెద్దాపురం ఆర్డీఓ జి. కృష్ణ మూర్తి, స్థానిక ఆర్డీఓ కార్యాలయ పరిపాలనాధికారి చైనులు, ఏలేరు డివిజన్ ఇరిగేషన్ ఈఈ జి. శేషగిరిరావు, తూర్పు ఈస్ట్రన్ డివిజన్ ఈ ఈ వి.వి. రామకృష్ణ, జిల్లా డ్రైనేజీ డివిజన్ ఈ ఈ ఎన్.వి.వి. కిషోర్, పంచాయతీ అధికా రులు, డిఈలు, ఏఈలు పాల్గొ న్నారు.

## బుర్రిపాలెంలో ఏర్పాట్లను పరిశీలించిన ఉన్నతాధికారులు

**అక్టోబర్ 4న పీఎంఏవై-గ్రామీణ్ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన**

**బహిరంగ సభ ఏర్పాట్లపై అధికారుల పరిశీలన**

**తాగునీరు, పారిశుధ్యం, రహదారి పనులు పక్కాగా చేపట్టాలని ఆదేశాలు**



తెనాలి మండలం, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): తెనాలి మండలం బుర్రిపాలెంలో బుధవారం ఉన్నతాధికారులు పర్యటించి అక్టోబర్ 4న జరగనున్న కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. పీఎంఏవై-గ్రామీణ్ కింద మంజూరైన గృహ నిర్మాణాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను సమీక్షించారు. గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి హెప్సీబా రాణి కొర్రపాటి, జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ, కేంద్ర మంత్రి పీఎస్ఏకే సింగ్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు బుర్రిపాలెం గ్రామ పొలిమేరల్లో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభ ప్రాంగణాన్ని పరిశీలించారు. సుమారు 5 వేల మంది వరకు ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్య ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో ఇప్పటికే జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి. రహదారి మరమ్మతు పనులు ఆర్అండ్‌బీ శాఖ పర్యవేక్షణలో చేపడుతున్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, తెనాలి ఆర్డీఓ కె. శ్రీరమణి, గుంటూరు ఆర్డీఓ కె. శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ పర్యవేక్షక ఇంజనీర్ ఆర్. శ్రీనివాసమూర్తి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె. కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయికుమార్, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జె.వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి. విజయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## అక్టోబర్ 1 నుంచి పింఛన్ల పంపిణీ

**2,50,576 మంది లబ్ధిదారులకు రూ.109.32 కోట్ల పంపిణీ**

**లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్ల అందజేత**

**అక్టోబర్ 1న తీసుకోలేని వారికి 3న పంపిణీ**

గుంటూరు, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): జిల్లాలో అక్టోబర్ నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ అక్టోబర్ 1వ తేదీ ఉదయం నుంచి ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్.. ఎస్‌జీఎస్‌డబ్ల్యూ, ఇతర ప్రభుత్వ సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. అక్టోబర్ 1న పింఛను తీసుకోలేని వారికి అక్టోబర్ 3న అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 2,50,576 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.109.32 కోట్ల పింఛను నగదు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. బ్యాంకుల నుంచి నగదు పొందడం, సిబ్బంది మ్యాపింగ్, పంపిణీ పర్యవేక్షణకు ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంపిణీ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా సిబ్బంది సంయమనంతో వ్యవహరించాలని సూచించారు.

## దుర్గిలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు

**స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో.. 40 మంది విద్యార్థుల పాల్గొనడం**



దుర్గి, సెప్టెంబర్ 30 (మహి న్యూస్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు బుధవారం దుర్గి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. అండర్--14 బాలబాలికలు, అండర్--17 బాలబాలికల విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 40 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను ఎంఈఓ బెంజిమెన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ హనుమంతరావు ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బండ్ల ప్రసాద్, వేణుగోపాల్, సునీతతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పల్నాడు జిల్లా అడ్మిన్ సెక్రటరీ షేక్ రషీదాభి, స్వర్ణ రాజు, బాజీతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించేందుకు ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.



## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి




నరసరావుపేట, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): గ్రామీణ, మారుమూల ప్రాంతాల ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల సూచించారు. 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా నరసరావుపేట లింగంగుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన మెడికల్ క్యాంపును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబుతో కలిసి ఆమె ప్రారంభించారు. శిబిరంలో పలు వైద్య విభాగాల నిపుణులతో పరీక్షలు, రక్త పరీక్షలు, కంటి పరీక్షలు, ఈసీజీ తదితర సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. తీవ్రమైన వ్యాధులు గుర్తించిన వారికి తదుపరి చికిత్స అందేలా ఆరోగ్యశాఖ చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఉచిత వైద్య శిబిరాలపై గ్రామీణ ప్రజలకు వాలంటీర్లు, ఆశా కార్యకర్తలు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో వైద్యులు, నర్సులు, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.






## 18, 19వ వార్డుల పార్టీ శ్రేణులకు ఐడీ కార్డుల పంపిణీ



మాచర్ల, సెప్టెంబర్ 30 :(మహి న్యూస్): మాచర్ల పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 18, 19వ వార్డులకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఐడీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులతో ముచ్చటించి, వార్డు స్థాయిలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, ప్రజలతో సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. పార్టీ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో 18, 19వ వార్డులకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రైల్వే ప్రాజెక్టు భూసేకరణను వేగవంతం చేయాలి



నరసరావుపేట, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): రైల్వే ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రక్రియను ప్రాధాన్యత ప్రాతిపదికన వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సీఆర్‌డీఏ భూములపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అమరావతి మండలంలోని కర్లపూడి, ఎండ్రాయి, వైకుంఠపురం గ్రామాల్లో 15 రోజుల్లో భూసేకరణ పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణకు సంబంధించి రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో రైల్వే అధికారులు, సత్తెనపల్లి ఆర్డీఓ, తహసీల్దార్, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.



## పల్లె పండుగతో నిధులు ప్రవాహం..!

**మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా అడుగులు..!**

**ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి**



దుర్గి సెప్టెంబర్ 30: (మహి న్యూస్): కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో పల్లెపండుగ కార్యక్రమం ద్వారా వేల కోట్ల నిధులతో రాష్ట్రంలోని గ్రామీణ మౌలిక వసతుల కల్పన జరుగుతోందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. పల్లెపండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్ -- గ్రామీణ' పథకం నిధులు ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా మౌలిక వసతుల కల్పన, మిని గోకుల షెడ్లు వంటి నిర్మాణాలకు రూ.10 కోట్ల మంజూరు కాగా.., బుధవారం కారంపూడి, దుర్గి మండలాల్లో పర్యటించి, పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ముందుగా కారంపూడి బీసీ కాలనీలో రూ. 23 లక్షలు, దుర్గి మండలం అడిగొప్పల గ్రామంలో రూ.20 లక్షలు, మండల పరిధిలోని ఓబులేసునిపల్లె గ్రామంలో రూ.40 లక్షలు, రూ.2 లక్షలు విలువ చేసే మిని గోకులం షెడ్, దుర్గి మండల కేంద్రంలో రూ. 47 లక్షలతో నూతన సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం దుర్గి ఇందిరమ్మ కాలనీ రూ. 50 లక్షలతో నిర్మించిన నూతన సీసీ రోడ్డును ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు శ్రీనివాసరెడ్డి, ప్రసాదరావు, పంచాయతీరాజ్ ఏఈ సత్యానారాయణ, కూటమి పార్టీల నాయకులు నాయకులు పంగులూరు అంజయ్య, పంగులూరి పుల్లయ్య, బొల్నేడి శ్రీనివాసరావు, మునుగోటి సత్యనారాయణ, లింగా బ్రహ్మయ్య, సీతారామాంజనేయులు, గోళ్ల సురేష్ యాదవ్, బాలకృష్ణ, తండా మస్తాన్ వలి, యాగంటి నరేష్, ఉన్నం మహేష్,గోపాల్, సింగు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు ఆపరేషన్ త్రిశూల్

**మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి**





గుంటూరు, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): గుంటూరు జిల్లాలో ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు ఆపరేషన్ త్రిశూల్ పేరుతో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ తెలిపారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి కలెక్టరేట్‌లో ఆపరేషన్ త్రిశూల్ తొలి సమావేశం నిర్వహించారు. మాదకద్రవ్యాల సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ హాట్‌స్పాట్లను గుర్తించి నిఘా పెంచాలని అధికారులను ఆదేశించారు. విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు గుంటూరు జీజీహెచ్‌లోని డీ-అడిక్షన్ కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, శక్తి బృందాల ద్వారా రక్షణ కల్పించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, గుర్తించిన ప్రమాదకర ప్రాంతాల్లో నెల రోజుల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అమరావతి ప్రాంతంలో అతివేగాన్ని నియంత్రించేందుకు వేగ నియంత్రణ పరికరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రమణమూర్తి, డీఆర్వో ఖాజావలి, ఆర్టీఓ శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.

## పల్నాడులో క్రీడా వైభవం వెల్లివిరియాలి..!

**యువత కోసం మండవ సేవలు స్ఫూర్తిదాయకం..!**

**ఎం పి ఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవంలో జూలకంటి**



మాచర్ల సెప్టెంబర్ 30: (మహి న్యూస్) : వెనుకబడిన పల్నాడులో క్రీడా వైభవం వెల్లివిరియాలి అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఉద్ఘాటించారు. బుధవారం స్థానిక ఎస్ కే బి ఆర్ కళాశాల క్రీడా మైదానంలో మండవ మాచర్ల ప్రిమియమ్ లీగ్ (ఎం పి ఎల్) క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవం వేడుకల్లో ఎమ్మెల్యే జూలకంటి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని, ట్రాస్ వేసి టోర్నీ మొదటి మ్యాచ్ ను ప్రారంభించారు. యువత కోసం జాతీయ స్థాయి ప్రమాణాలతో క్రికెట్ లీగ్ ను నిర్వహించడం పట్ల మండవ రవిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., యువతలో క్రీడా స్ఫూర్తి నింపేలా క్రికెట్ పోటీలు నిర్వహిచడం అభినందనీయమన్నారు. పట్టుదల, దీక్ష, కఠోర శ్రమలతో పడిలేచే కెరటాలాంటి క్రీడాకారుల ప్రయాణం ఏదో ఒక రోజు విజయ తీరాన్ని చేర్చుతుందని సూచించారు. క్రీడాల్లో రాణించి, పతకాలను సాధించిన క్రీడాకారులకు కూటమి ప్రభుత్వం గౌరవించి మెగా డీఎస్సీ లో ఉద్యోగాలు అందిస్తే.., వారిని వైసీపీ నాయకులు, జగన్ రెడ్డి ఘోరంగా దూషించి, అవమానిస్తున్నారని మండిపడ్డారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా వందల కోట్లు కొల్లగొట్టిన జగన్ రెడ్డికేం తెలుసు క్రీడాకారుల విలువ అని ఎద్దేవా చేశారు. వెనుకబడి మాచర్ల నియోజకవర్గంలో ఉన్న యువత కోసం అనేక సేవ కార్యక్రమాలు చేస్తున్న మండవ రవికి తన వంతు సహాయసహకారులు ఎప్పుడూ ఉంటాయన్నారు. త్వరలో క్రీడాకారులు కోసం క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని, స్థల పరిశీలన జరుగుతోందన్నారు. అలానే తన సొంత ఖర్చులతో క్రికెటర్లు నెట్ ప్రాక్టీస్ కు వసతులు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు యాగంటి మల్లికార్జునరావు, కజ్జం సైదయ్య, యెనుముల కేశవరెడ్డి, మద్దిగపు వెంకటరామిరెడ్డి, టీడీపీ పట్టణాధ్యక్షులు కొమెర దుర్గారావు, మదార్ సాహెబ్, టోర్నీ ఆర్గనైజింగ్ టీమ్ అన్వర్ బాషా, క్రాంతి కుమార్, చిన్ని, కేపీచారి, సాంబ తదితరులు పాల్గొన్నారు.



## శిశుగృహంలో శిశువుల ఆరోగ్యంపై ఆరా

**పోషకాహారం, పరిశుభ్రతపై**

**ప్రత్యేక శ్రద్ధ చూపాలి**



గుంటూరు, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి సూచనలతో సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ గుంటూరులోని శిశుగృహాన్ని సందర్శించారు. శిశువులు, పసిపిల్లల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, వారికి అందుతున్న పోషకాహారంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది కట్ట కాళిదాసు, శిశుగృహం ఇన్‌చార్జి ఓలివా చంద్రిక, సిబ్బంది, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## నరసరావుపేటలో అధికారుల మెరుపు దాడులు

**మెడికల్ షాపులు, హోటళ్లపై ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు**




నరసరావుపేట, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): పల్నాడు జిల్లా నరసరావుపేటలో డ్రగ్ కంట్రోల్, ఫుడ్ కంట్రోల్, విజిలెన్స్, ఈగల్ బృందాలు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. రాష్ట్ర ఈగల్ టీమ్ డైరెక్టర్ అరుణ్ బాబు ఆధ్వర్యంలో ఐదు బృందాలుగా విడిపోయి మెడికల్ షాపులు, హోటళ్లలో విస్తృతంగా సోదాలు చేపట్టారు. అనుమతులు లేకుండా విక్రయిస్తున్న మందులను గుర్తించి అధికారులు సీజ్ చేశారు. ఆహార కల్తీ ఆరోపణల నేపథ్యంలో నరసరావుపేటలో ఐదు హోటళ్లను తనిఖీ చేసి సీజ్ చేయడంతో పాటు వాటి లైసెన్సులను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల నేపథ్యంలో పలువురు వ్యాపారులు దుకాణాలు, హోటళ్లను మూసివేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

## పిడుగురాళ్ల ప్రభుత్వ మెడికల్ కాలేజీ అభివృద్ధిపై సమీక్ష

**మౌలిక వసతులు, విద్యార్థుల సౌకర్యాలకు ప్రాధాన్యం: కలెక్టర్ కృతిక శుక్ల**




నరసరావుపేట, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): పిడుగురాళ్ల ప్రభుత్వ మెడికల్ కాలేజీ అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల అధికారులను సూచించారు. మెడికల్ కాలేజీ అభివృద్ధి కమిటీ సమావేశంలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కలిసి ఆమె అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలపై సమీక్షించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. కాలేజీ మౌలిక వసతులను దశలవారీగా మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కాలేజీ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు.




## ప్రజల భాగస్వామ్యంతో పల్లె పండుగ 3.0 పనులు సకాలంలో పూర్తి చేయాలి

**గురజాల నియోజకవర్గానికి రూ.10 కోట్లతో 107 అభివృద్ధి పనులు**






నరసరావుపేట, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి చేపడుతున్న 'పల్లె పండుగ 3.0' పనులను ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకంగా, సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల తెలిపారు. పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురజాల నియోజకవర్గానికి రూ.10 కోట్లు మంజూరు కాగా, 107 పనులను చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రోడ్లు, డ్రైన్ల పనులను వచ్చే మూడేళ్లలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో డ్రైన్ల నిర్మాణానికి అవసరమైన చోట 'మ్యాజిక్ డ్రైన్లు' చేపట్టనున్నట్లు తెలిపారు. పల్లె పండుగ ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## పునరుద్ధరించిన డీఎంహెచ్ఓ కార్యాలయాన్ని ప్రారంభించిన కలెక్టర్

**పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణంతో పనితీరు మెరుగుపడుతుంది**



గుంటూరు, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): మరమ్మతులు చేసి పునరుద్ధరించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ బుధవారం ప్రారంభించారు. కార్యాలయాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచుకోవాలని సూచించారు. ఉద్యోగులు ఎక్కువ సమయం కార్యాలయాల్లోనే గడుపుతారని, మంచి వాతావరణం పనితీరు, సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు.




### పదవీ విరమణ చేసిన డీఎంహెచ్ఓకు అభినందనలు



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా సుదీర్ఘకాలం సేవలందించి బుధవారం పదవీ విరమణ చేసిన కె. విజయలక్ష్మికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆమె శేష జీవితం ఆరోగ్యంగా, సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. జిల్లాలో ప్రజలకు అందించిన సేవలను అభినందిస్తూ, వృత్తిని నిబద్ధతతో నిర్వర్తించిన వారి సేవలు ప్రజల్లో ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

# 2047 నాటికి రూ.80 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా తిరుపతి ఎకనామిక్ రీజియన్




తిరుపతి, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల ఆర్థిక వృద్ధి అవకాశాలపై తిరుపతి ఎకనామిక్ రీజియన్ సదస్సులో విస్తృతంగా చర్చించారు. జోన్ సీఈఓ ముకేశ్ కుమార్ మీనా ఆధ్వర్యంలో భాగస్వాముల సదస్సు ప్రారంభమైంది. 2047 నాటికి తిరుపతి ఎకనామిక్ రీజియన్‌ను రూ.80 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. పరిశ్రమలు, పర్యాటకం, వ్యవసాయం, లాజిస్టిక్స్, సేవల రంగాల అభివృద్ధితో పాటు పెట్టుబడులు, ఉపాధి అవకాశాల పెంపుపై దృష్టి సారించనున్నట్లు చెప్పారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు, కనెక్టివిటీ, నైపుణ్యాభివృద్ధిని బలోపేతం చేయనున్నట్లు తెలిపారు.



## తిరుపతి ఆర్థిక ప్రాంత ప్రణాళిక-2047కు క్షేత్రస్థాయి సూచనలు కీలకం



తిరుపతి, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): తిరుపతి ఆర్థిక ప్రాంతం (టీఈఆర్) ప్రణాళిక--2047 రూపకల్పనలో క్షేత్రస్థాయి భాగస్వాముల సూచనలు కీలకమని టీఈఆర్ సీఈఓ ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. తిరుపతి కలెక్టరేట్‌లో తిరుపతి, చిత్తూరు, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాల భాగస్వాములతో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పారిశ్రామిక, లాజిస్టిక్స్, పర్యాటక, వ్యవసాయ, సేవారంగాల సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. అభివృద్ధి లోటుపాట్లను గుర్తించి టీఈఆర్ పరిధిలో 50--60 కీలక ప్రాజెక్టులను గుర్తించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. స్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధనం, ఆహార శుద్ధి, వ్యవసాయం, పర్యాటకం వంటి రంగాల్లో పెట్టుబడులు, ఉపాధి అవకాశాల పెంపునకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రహదారులు, రైల్వే, పోర్టులు, విమానాశ్రయాలు, విద్యుత్, నీరు, నైపుణ్యాభివృద్ధి వంటి మౌలిక వసతులను సమన్వయంతో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తిరుపతి--తిరుమల, శ్రీకాళహస్తి, కాణిపాకం, తలకోన, శ్రీహరికోట తదితర ప్రాంతాలను అనుసంధానిస్తూ సమగ్ర పర్యాటక సర్క్యూట్ల అభివృద్ధికి భాగస్వాములు సూచనలు చేశారు. స్థానిక యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించాలని అభిప్రాయపడ్డారు. సదస్సులో జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, నిపుణులు, కేపీఎంజీ ప్రతినిధులు పాల్గొన్నారు. భాగస్వాముల సూచనలను పరిగణనలోకి తీసుకుని టీఈఆర్ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళిక రూపొందిస్తామని అధికారులు తెలిపారు.






## ఉత్సాహంగా జిల్లా యువజనోత్సవాలు-2026




చిత్తూరు, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): చిత్తూరు విజయమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు--2026ను బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 150 మంది యువతీ యువకులు పాల్గొని జానపద నృత్యం, జానపద గీతాలు, వీధి నాటకం, పెయింటింగ్, కవితా రచన తదితర పోటీల్లో ప్రతిభ చాటారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ యువత విద్యతో పాటు కళలు, క్రీడలు, సృజనాత్మకత, సామాజిక బాధ్యతలో ముందుకు సాగాలని సూచించారు. రాజుఎజుచీ సీఈఓ డా. యశ్వంత్ మాట్లాడుతూ యువతలోని ప్రతిభను గుర్తించి వారికి మరిన్ని అవకాశాలు కల్పించడమే యువజనోత్సవాల లక్ష్యమన్నారు. ఫోక్ డ్యాన్స్‌లో ద్రవిడియన్ యూనివర్సిటీ విద్యార్థుల బృందం, ఫోక్ సాంగ్‌లో సి. కుసుమ బృందం, వీధి నాటకంలో హరిప్రసాద్, పెయింటింగ్‌లో ఎన్. దుర్గా శ్రీ, కవితా రచనలో జి. హాసిక ప్రథమ బహుమతులు సాధించారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రథమ స్థానాల్లో నిలిచిన వారు రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో చిత్తూరు జిల్లా తరఫున పాల్గొననున్నారు.





## పల్లె పండుగ 3.0తో గ్రామాలకు మహర్దశ




చిత్తూరు, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): 'పల్లె పండుగ 3.0'తో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడి అభివృద్ధి వేగవంతం కానుందని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.11,085 కోట్లతో 15,500 కిలోమీటర్ల సీసీ, బీటీ రోడ్లు, 22,000 మినీ గోకులాలు, 1,000 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయడం ద్వారా గ్రామీణ కూలీలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. చిత్తూరు పార్లమెంట్ పరిధిలో ప్రతి గ్రామానికి ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం కలిగేలా ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములై పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా పర్యవేక్షించాలని ఎంపీ సూచించారు. మినీ గోకులాలు, ఉద్యానవనాల అభివృద్ధితో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని తెలిపారు.

## జయరామిరెడ్డి కుటుంబానికి బాల్యమిత్రుల పరామర్శ



నాయుడుపేట, సెప్టెంబర్ 30, మహి న్యూస్: నాయుడుపేట పట్టణంలో బుధవారం జరిగిన విద్యుత్ శాఖ విశ్రాంత ఏడీఈ జయరామిరెడ్డి ఉత్తర క్రియల కార్యక్రమాల్లో అమెరికా నుంచి వచ్చిన లింగారెడ్డి జయప్రకాష్ రెడ్డితో పాటు స్థానిక బాల్య మిత్రుల బృందం పాల్గొంది. ఈ సందర్భంగా వారు జయరామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారులు లింగారెడ్డి భాను ప్రకాష్ రెడ్డి, జయప్రకాశ్ రెడ్డిలతో పాటు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టసమయంలో భగవంతుడు ఆ కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాల్య మిత్రుల బృందం సభ్యులైన ఓడూరు గిరిధర్ రెడ్డి, కామిరెడ్డి మోహన్ రెడ్డి, గాదిరెడ్డి చక్రధర్, పులి వెంకటేశ్వర్లు, ఓడూరు ముని క్రిష్ణారెడ్డి, పిండూకూరు రాజశేఖరరెడ్డి, నల్లపనేని జనార్ధన్, ఉన్నం మురళి ప్రసాద్, మోహన్, ఆనం శ్రీనివాసులు, అల్లెయ్య, పెనుకొండ అశోక్, నరసిహూలు, బొడ్డు ప్రసాద్, కామిరెడ్డి మధుసూదన్ రెడ్డి, బత్తేయ్య, కేశం హరిబాబు, అన్నేమనేని రామకృష్ణ, గుండాల సురేష్, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి ఎకనామిక్ రీజియన్ ప్లాన్-2047పై ప్రాంతీయ భాగస్వాముల సంప్రదింపుల సదస్సు

**తిరుపతి ఆర్థిక ప్రాంత ప్రణాళిక-2047 రూపకల్పనకు క్షేత్రస్థాయి సూచనలే కీలకం పారిశ్రామిక, లాజిస్టిక్స్, పర్యాటక, వ్యవసాయ, సేవా రంగాల సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ అభివృద్ధి అంతరాలను గుర్తించి 50-60 కీలక ప్రాజెక్టుల రూపకల్పనకు చర్యలు భాగస్వాముల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించడమే లక్ష్యం: ముఖేష్ కుమార్ మీనా, సీఈఓ, తిరుపతి ఎకనామిక్ రీజియన్**




తిరుపతి, సెప్టెంబర్ 30, మహి న్యూస్: స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్య సాధనలో భాగంగా తిరుపతి ఎకనామిక్ రీజియన్ ( ప్రణాళిక-



-2047 రూపకల్పనకు క్షేత్రస్థాయి భాగస్వాముల సూచనలు, సలహాలు ఎంతో కీలకమని తిరుపతి ఎకనామిక్ రీజియన్ సీఈఓ ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి కలెక్టరేట్ వీసీ హాల్లో తిరుపతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిపై తిరుపతి, చిత్తూరు, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాల భాగస్వాములతో ఒకరోజు సంప్రదింపుల సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుపతి ఎకనామిక్ రీజన్ సీఈఓ ముఖేష్ కుమార్ మీనాతో పాటు ప్రణాళికా శాఖ జాయింట్ సెక్రటరీ అనంత శంకర్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు (తిరుపతి), గాలి భాను ప్రకాష్ (నగరి), నెలవల విజయశ్రీ (సూళ్లూరుపేట), కోనేటి ఆదిమూలం (సత్యవేడు), నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ పాల్గొన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివ శంకర్ నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, సీపీఓ రాజశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, నిపుణులు, కేపీఎంజీ ప్రతినిధులు హాజరయ్యారు.

### సదస్సులోని ముఖ్యాంశాలు:

### భాగస్వామ్య ఆధారిత ప్రణాళిక తిరుపతి ఎకనామిక్ రీజన్ సీఈఓ ముఖేష్ కుమార్ మీనా):

ఈ ప్రణాళికను కేవలం డేటా సేకరణకే పరిమితం చేయకుండా ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, నిపుణుల ప్రత్యక్ష సూచనలతో రూపొందిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి--నెల్లూరు ప్రాంతాల్లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ , తయారీ, టెస్టింగ్, లాంచ్ సదుపాయాలను అనుసంధానిస్తూ సమగ్ర స్పేస్, డిఫెన్స్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. 2,500 ఎకరాల్లో అభివృద్ధి చెందుతున్న స్పేస్ సిటీలో భూకేటాయింపులు ప్రారంభమయ్యాయని, ఐఐటీ, ఐజర్ భాగస్వామ్యంతో ఆర్ అండ్ డీ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోర్టులు, విమానాశ్రయాలు, పరిశ్రమలను అనుసంధానించే సింగిల్ బాండెడ్ కారిడార్ ద్వారా రవాణా వ్యయం, సమయాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు.

### ఆర్థిక స్థితిగతుల సమీక్ష (ప్రణాళికా శాఖ జాయింట్ సెక్రటరీ అనంత శంకర్):

ఈ ప్రాంతంలోని 9 జిల్లాలు రాష్ట్ర వైశాల్యంలో సగానికి పైగా ఉన్నప్పటికీ రాష్ట్ర జీఎస్డీపీలో వాటి వాటా దాదాపు మూడో వంతు మాత్రమే ఉందని తెలిపారు. సహజ, మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా విశాఖ, అమరావతి రీజియన్ల తరహాలోనే టీఈఆర్ ద్వారా భారీ ఆర్థిక ప్రగతి సాధించే అవకాశం ఉందన్నారు.

### రోడ్డు, రవాణా అనుసంధానం (తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్):

తిరుపతి పరిసరాల్లో సుమారు 15 వేల ఎకరాల పారిశ్రామిక విస్తీర్ణం అందుబాటులో ఉందని, పరిశ్రమల విస్తరణకు బలమైన రహదారి అనుసంధానం అవసరమని తెలిపారు. చిత్తూరు--తచ్చూరు ఎక్స్‌ప్రెస్‌వే, బెంగళూరు--చెన్నై ఎక్స్‌ప్రెస్‌వే, శ్రీసిటీ, కోల్‌కతా--చెన్నై జాతీయ రహదారులను కలిపే లింక్ రోడ్లతో పాటు శ్రీకాళహస్తి--తడ రహదారి అభివృద్ధి అత్యంత కీలకమన్నారు.

### నైపుణ్యాభివృద్ధి - విద్యుత్ మౌలిక వసతులు (నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా):

బీపీసీఎల్, రక్షణ తయారీ, పోర్టు ఆధారిత పరిశ్రమలకు అనుగుణంగా వెల్డింగ్, సోలార్ వేఫర్స్ తయారీ, డ్రోన్ టెక్నాలజీ, క్రేన్ ఆపరేషన్ వంటి రంగాల్లో స్థానిక యువతకు ముందస్తు శిక్షణ అందించాలని సూచించారు. బీపీసీఎల్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటవుతుందని తెలిపారు. అలాగే గ్రీన్ హైడ్రోజన్, డేటా సెంటర్ల విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కృష్ణపట్నం, రామాయపట్నం ప్రాంతాల్లో ముందస్తు విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్ల పనులు చేపట్టాలన్నారు.

### పారిశ్రామిక భూములు - పెట్టుబడులు (చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్):

చెన్నై మార్కెట్‌కు సమీపంగా ఉండటం జిల్లాకు పెద్ద అనుకూలత అని, జిల్లాలో పారిశ్రామిక పార్కుల కోసం 2,000--2,500 ఎకరాల భూమి అందుబాటులో ఉందని తెలిపారు. గత రెండేళ్లలో మరో 476 ఎకరాలు సేకరించామని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్, గార్మెంట్, పౌల్ట్రీ పరిశ్రమల్లో అవసరమైన మానవ వనరులకు పరిశ్రమల భాగస్వామ్యంతోనే శిక్షణ ఇవ్వాలని సూచించారు.

### యువతకు ఉపాధి - స్వయం ఉపాధి (ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్):

డిగ్రీ, ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు రెండో ఏడాది నుంచే పరిశ్రమలతో అనుసంధానం, ఇంటర్న్‌షిప్‌లు, స్టార్టప్ అవగాహన కల్పించాలని సూచించారు. తిరుపతి ప్రాంతంలో హోమ్‌స్టేలను ప్రోత్సహించడం ద్వారా యువతకు స్వయం ఉపాధి కల్పించవచ్చని తెలిపారు.

### ప్రజాప్రతినిధుల సూచనలు:

### తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు:

తిరుపతి, తిరుమలతో పాటు శ్రీకాళహస్తి, కాణిపాకం పుణ్యక్షేత్రాలను అనుసంధానిస్తూ భక్తులు 2--3 రోజులు బస చేసేలా టెంపుల్ టూరిజం సర్క్యూట్‌ను విస్తరించాలని, ఎలక్ట్రానిక్స్, ఈవీ, ఎంఎస్ఎంఈ పార్కులను ప్రోత్సహించాలని కోరారు.

### సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ:

ఇరకం ఐలాండ్, పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల కేంద్రం, శ్రీహరికోటలను కలుపుతూ పర్యావరణ అనుమతులతో సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలన్నారు.

### సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం:

శ్రీసిటీ పారిశ్రామిక ట్రాఫిక్ దృష్ట్యా బైపాస్ రహదారి నిర్మించాలని, సత్యవేడు సీహెచ్‌సీని ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని, సరిహద్దు ప్రాంత మౌలిక వసతులు మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్: నగరి నియోజకవర్గంలో పారిశ్రామిక అవసరాలకు అందుబాటులో ఉన్న దాదాపు 5,000 ఎకరాల భూమిని పూర్తి మౌలిక వసతులతో అభివృద్ధి చేసి పరిశ్రమలను ఆకర్షించాలని సూచించారు.

### పర్యావరణ నిబంధనలు (అటవీ శాఖ):

పులికాట్ ప్రాంతంలో ప్రాజెక్టులు చేపట్టేటప్పుడు వన్యప్రాణి అభయారణ్య నిబంధనలను, కేంద్ర ప్రభుత్వ అనుమతులను తప్పనిసరిగా పాటించాలని, చిలికా సరస్సు అభివృద్ధి నమూనాను అధ్యయనం చేయవచ్చని అధికారులు పేర్కొన్నారు.

### కేపీఎంజీ కార్యాచరణ:

రాష్ట్ర ప్రణాళికలో భాగంగా ఏరోస్పేస్, సెమీకండక్టర్లు, షిప్‌బిల్డింగ్, పునరుత్పాదక ఇంధనం, ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలు కీలకంగా మారనున్నాయని, జిల్లా లోటుపాట్లను సరిచేస్తూ 50--60 యాంకర్ ప్రాజెక్టులను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. సదస్సు ముగింపులో కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ, సదస్సులో వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా తిరుపతి ఎకనామిక్ రీజియన్‌ను అత్యుత్తమ అభివృద్ధి ప్రాంతంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. సదస్సు విజయవంతానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశ్రామికవేత్తలు, కేపీఎంజీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.



# కూటమి ప్రభుత్వంలో గాడితప్పిన పాలన

## వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్న నెల్లూరు హౌసింగ్ హెడ్.

## సూళ్లూరుపేట ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని నెల్లూరులో 'డ్యూటీ'

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 30, మహి న్యూస్:: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిపాలన గాడితప్పింది అనడానికి నెల్లూరు, తిరుపతి జిల్లాల హౌసింగ్ విభాగంలో జరుగుతున్న ఈ ఘోర తప్పిదమే నిదర్శనంగా నిలుస్తోంది. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట డివిజన్ పరిధిలోని హౌసింగ్ కార్యాలయంలో విధులు నిర్వహించాల్సిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఆప్కాస్ ఉద్యోగిని కోవూరు షీబా, నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా నెల్లూరు జిల్లా కేంద్రంలో పనిచేస్తుండడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

### ఇన్చార్జ్ హౌసింగ్ హెడ్ 'జహీరుద్దీన్' పక్కా స్కెచ్.

ఈ అక్రమ బదిలీ, విధుల దుర్వినియోగం వెనుక నెల్లూరు జిల్లా హౌసింగ్ హెడ్‌గా ఇన్చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్న జహీరుద్దీన్ హస్తం ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన వేసిన పక్కా పథకంలో భాగంగానే ఈ మహిళా ఉద్యోగిని ప్రభుత్వం నియమించిన జిల్లాకు కాకుండా, మరో జిల్లా కేంద్రంలో యథేచ్ఛగా పనిచేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇన్చార్జ్ బాధ్యతల్లో ఉంటూ జహీరుద్దీన్ ప్రభుత్వ వ్యవస్థనే పూర్తిస్థాయిలో దుర్వినియోగం చేస్తున్నట్లు అన్ని ఆధారాలతో సహా బట్టబయలైంది.

### మెమోలు ఇచ్చినా బేఖాతర్.. సాక్ష్యాధారాలున్నా నిర్లక్ష్యం.

ఈ అక్రమ ఉదంతంపై తిరుపతి జిల్లా హౌసింగ్ హెడ్ స్పందించి, నిబంధనలు ఉల్లంఘించిన కోవూరు షీబాకు పలుమార్లు మెమోలు జారీ చేశారు. ఆ మెమో కాపీలను నెల్లూరు జిల్లా హౌసింగ్ కార్యాలయానికి కూడా పంపించారు. అయినప్పటికీ నెల్లూరు ఇన్చార్జ్ హెడ్ జహీరుద్దీన్ ఆ మెమోలను బుట్టదాఖలు చేస్తూ, సదరు ఉద్యోగినిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం బేఖాతర్ చేస్తూ వ్యవహరిస్తున్న తీరు ఇక్కడ విస్మయానికి గురిచేస్తోంది.

### దొంగ చేతికే తాళాలు. నిందితుడే విచారణ అధికారి.

ఈ వ్యవస్థీకృత అక్రమంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ప్రధాన కార్యాలయానికి ఆధారాలతో సహా ఫిర్యాదు అందింది. అయితే, ఈ ఫిర్యాదుపై రాష్ట్ర కార్యాలయం స్పందించిన తీరు మరీ దారుణంగా ఉంది. ఏ అధికారిపైన అయితే వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు వెళ్ళిందో, అదే నెల్లూరు జిల్లా హౌసింగ్ ఇన్చార్జ్ హెడ్ జహీరుద్దీన్‌నే ఈ వ్యవహారానికి విచారణ అధికారిగా నియమించడం గమనార్హం. దొంగ చేతికే తాళాలు ఇచ్చినట్లుగా ఉన్న ఈ వ్యవహారం చూస్తుంటే కూటమి ప్రభుత్వంలో అధికారుల అక్రమాలకు అడ్డుఅదుపు లేకుండా పోయిందని, పరిపాలన పడకేసిందని స్పష్టంగా అర్థమవుతోంది.

## ఎస్ ఐ ఆర్ పేరుతో ఓటర్లకు ప్రమాదం:కాంగ్రెస్



తిరుపతి, సెప్టెంబర్ 30, మహి న్యూస్: ఎస్ ఐ ఆర్ పేరుతో ఏకపక్షంగా లక్షలాది ఓట్లను తొలగిస్తున్నారంటూ నిరసిస్తూ తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌కు కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ నిరసన కార్యక్రమం డిసిసి అధ్యక్షులు బాల గురవబాబు ఆధ్వర్యంలో జరగగా, అందులో 7 నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు. సూళ్లూరుపేట హోలీ క్రాస్ ప్రాంతం నుంచి ఇన్‌ఛార్జ్ డి. కిరణ్ కుమార్ నేతృత్వంలో సుమారు 200 మందితో భారీ కాన్వాయ్‌గా కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్నారని నాయకులు మండిపడ్డారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ పిలుపు మేరకు, వైఎస్ షర్మిలమ్మ ఆదేశాలతోనే ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని కిరణ్ కుమార్ స్పష్టం చేశారు. ఓటర్ల హక్కులను కాలరాస్తున్న ఈ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని కాంగ్రెస్ నేతలు గట్టిగా డిమాండ్ చేశారు. అదేవిధంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిని తక్షణమే అరెస్టు చేయాలని కూడా వారు కోరారు. జిల్లాల్లో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తమ నిరసన స్వరాన్ని వినిపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పునరుద్ధరించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన శ్రేణులతో కలెక్టరేట్ పరిసర ప్రాంతాలు కాంగ్రెస్ నినాదాలతో హోరెత్తాయి.

## స్థానిక వైఎస్ఆర్సిపి నేతలను కలసిన తగ్గువారిపల్లి యువ నాయకుడు జగదీష్.

చిత్తూరు జిల్లా/ బంగారుపాళ్యం సెప్టెంబర్ 30. : చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం తగువారిపల్లె పంచాయతీకి చెందిన యువ నాయకుడు కె. జగదీష్ జిల్లా యువజన విభాగం నూతన కార్యదర్శిగా వైఎస్ఆర్సిపి పార్టీ నియమించినందుకు బుధవారం మండల కన్వీనర్ పాలేరు రామచంద్ర రెడ్డి, మండల వైస్ ఎంపీపీ శిరీస్ రెడ్డిలను తగ్గువారిపల్లి పంచాయతీకి చెందిన తన అనుచరులతో కలిసి జగదీష్ శుభాకాంక్షలు తెలియజేశారు. యువ నాయకుడు కె. జగదీష్ పార్టీకి అందించిన సేవలను గుర్తించి చిత్తూరు జిల్లా యువజన విభాగం కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ రామచంద్ర రెడ్డి, మండల వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి లకు జగదీష్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా యువజన విభాగం కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన డాక్టర్ ఎం.సునీల్ కుమార్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు, తగ్గువారి పల్లి ఇంచార్జ్ షాకీర్, ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి రఘుపతి రాజు, మైనార్టీ నాయకులు ఖాదర్బాషా, ఎక్స్ ఎంపీటీసీ హేమచంద్ర, మండల సెక్రెటరీ ముబారక్, ఆటో వంశీ, తగువారి పల్లి యూత్ లీడర్ మనీ, తగ్గవారిపల్లి విలేజ్ సెక్రెటరీ ప్రదీప్, విలేజ్ యూత్ వింగ్ జనరల్ సెక్రెటరీ కె బద్రి, మండల్ యూత్ మెంబర్ మంజు, సోషల్ మీడియా విన్ సెక్రెటరీ అష్రాఫ్, తగ్గ వారి పల్లి బీసీ నాయకులు వినోద్, తగ్గువారిపల్లి యువ నాయకుడు సాగర్, తగ్గువారిపల్లి యూత్ నెంబర్ కౌశిక్, నాగభూషణ. జగదీష్‌ను అభినందించి, నూతన బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# వంతెనల వద్ద చెత్తకు చెక్..
# రూ.52 లక్షలతో రక్షణ వలయాలు

## హంద్రీ, కేసీ కెనాల్ వంతెనల వద్ద ప్రత్యేక చర్యలు

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూలు, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): నగరంలోని వంతెనల పరిసరాల్లో పరిశుభ్రతను కాపాడటంతో పాటు ప్రమాదాల నివారణకు రూ.52 లక్షలతో రక్షణ వలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. బుధవారం ఆనంద్ టాకీస్ వద్ద హంద్రీ నదిపై ఏర్పాటు చేస్తున్న రక్షణ వలయాన్ని ఆయన పరిశీలించారు. ఆనంద్ టాకీస్, రాజ్‌విహార్, జొహరాపురం ప్రాంతాల్లో హంద్రీ నదిపై, అశోక్‌నగర్, కేవీ కళాశాల ప్రాంతాల్లో కేసీ కెనాల్‌పై ఉన్న వంతెనలకు రక్షణ వలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో చెత్త వేయకుండా నియంత్రించడంతో పాటు నదులు, కాలువల పరిశుభ్రత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. అనంతరం సెట్కూరు కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేవీఆర్ కళాశాల, స్టాంటన్‌పురం, జొహరాపురం ప్రాంతాల్లో గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఈ కృష్ణలత, ఏఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# రూ.4,191 కోట్లతో కర్నూలు ఉద్యాన రంగానికి భారీ ప్రణాళిక

## 60 వేల హెక్టార్లలో అదనంగా ఉద్యాన పంటల సాగు లక్ష్యం
## సాగునీటి రంగానికి రూ.2,000 కోట్లు.. రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం
## గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌పై ట్రాక్టర్ ర్యాలీ



కర్నూలు, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): కర్నూలు జిల్లాను ఉద్యాన పంటల సాగుకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర కార్యాచరణ అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్--రాయలసీమ రైజింగ్‌పై ప్రజలు, రైతుల్లో అవగాహన కల్పించేందుకు బుధవారం కలెక్టరేట్ నుంచి సీ-క్యాంప్ రైతుబజార్ వరకు నిర్వహించిన ట్రాక్టర్ ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. రాయలసీమ రైజింగ్‌లో భాగంగా కర్నూలు జిల్లాకు సుమారు రూ.4,191 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో సాగునీటి రంగానికి సుమారు రూ.2,000 కోట్లు, ఉద్యాన పంటల విస్తరణకు రూ.1,642 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఉద్యాన పంటల సాగు విస్తీర్ణాన్ని అదనంగా 60 వేల హెక్టార్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది సుమారు 15 వేల హెక్టార్ల చొప్పున విస్తీర్ణాన్ని పెంచేలా కార్యాచరణ రూపొందించామన్నారు. నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో మామిడి, చీని, కమల తదితర శాశ్వత ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తామని చెప్పారు. వేదవతి ప్రాజెక్టును కార్యాచరణలో చేర్చినట్లు, గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యాన్ని 4.5 టీఎంసీల నుంచి 5.5 టీఎంసీలకు పెంచేందుకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలో 111 కొత్త సూక్ష్మ సాగునీటి ట్యాంకుల నిర్మాణానికి అనుమతులు లభించాయని చెప్పారు. రహదారుల అభివృద్ధిలో భాగంగా 721 కిలోమీటర్ల కొత్త రహదారుల నిర్మాణానికి అనుమతులు లభించగా, సుమారు 400 కిలోమీటర్ల రహదారులకు మరమ్మతు పనులు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ఈ శైలేశ్వర్, పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, ఉద్యాన శాఖ ఏడీ రాజకృష్ణారెడ్డి, మైక్రో ఇరిగేషన్ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# 44 ఏళ్ల పోలీసు సేవలకు వీడ్కోలు..
# ఎస్సై సోమ్లు నాయక్‌కు ఘన సన్మానం

## పదవీ విరమణ చేసిన ఎస్సైకి సత్కారం
## జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్



కర్నూలు, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): పోలీసు శాఖలో 44 ఏళ్ల పాటు సేవలందించి పదవీ విరమణ పొందిన ఎస్సై ఎస్. సోమ్లు నాయక్‌ను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఘనంగా సన్మానించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో శాలువా, పూలమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కర్నూలు ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్ (పీసీఆర్ అటాచ్‌మెంట్)లో విధులు నిర్వహిస్తూ సోమ్లు నాయక్ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 44 ఏళ్ల పాటు పోలీసు శాఖకు సేవలందించడం అభినందనీయమన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఏవైనా సమస్యలు ఎదురైతే నేరుగా జిల్లా ఎస్పీని సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసూదన్‌రావు, ఆర్ఐ నారాయణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

# యువత ప్రతిభకు యువజన ఉత్సవాలు చక్కటి వేదిక

## వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత కీలక భాగస్వాములు కావాలి
## జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



నంద్యాల, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): యువతలో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలు, సృజనాత్మకతను వెలికితీసేందుకు యువజన ఉత్సవాలు చక్కటి వేదికగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత చురుకైన భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణంలోని అయ్యలూరు మెట్ట ప్రాంతంలోని ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజన ప్రతిభ ప్రదర్శన కార్యక్రమాన్ని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. జానపద నృత్యం, జానపద గీతం, నుక్కడ్ నాటకం, చిత్రలేఖనం, కవితా రచన తదితర పోటీలు నిర్వహించారు. చదువుతో పాటు నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, సృజనాత్మక ఆలోచనా విధానాన్ని యువత పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు.

### దేశ ప్రగతిలో యువత కీలక భాగస్వాములు: ఎంపీ బైరెడ్డి శబరి

వికసిత్ భారత్ 2047, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఉద్యోగ, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### యువత ఆలోచనలు, ఆకాంక్షలకు ప్రోత్సాహం అవసరం: ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ




యువత ఆలోచనలు, ఆకాంక్షలు, ప్రతిభను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సోషల్ మీడియాను సానుకూల కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు. పరిశ్రమలు, పెట్టుబడుల ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

# చిన్నటేకూరులో రైతులకు నీటి సంరక్షణపై శిక్షణ

## పండ్లు, పూలు, కూరగాయ పంటల్లో సమగ్ర నీటి పారుదలపై అవగాహన
## నీటి పొదుపు, సంరక్షణ చర్యలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి
## ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి



కల్లూరు మండలం, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉద్యాన శాఖ కర్నూలు ఆధ్వర్యంలో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్--రాయలసీమ రైజింగ్' కార్యక్రమంలో భాగంగా చిన్నటేకూరు గ్రామంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పండ్లు, పూలు, కూరగాయ పంటల్లో సమగ్ర నీటి పారుదల, నీటి సంరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతులు నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ ఆధునిక సాగు పద్ధతులను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ రామ గిడ్డయ్య, ఉలిందకొండ సొసైటీ చైర్మన్ ఈవీ రమణ, ఎంపీడీవో శ్రీనివాసులు, మండల వ్యవసాయ శాఖ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీపీ మధేశ్, గ్రామ నాయకులు రామాంజనేయులు, శేషగిరి, లక్ష్మన్న, రాజశేఖర్, మౌలాలి, జనసేన నాయకుడు బజారన్న, ఎంపీటీసీ మునిస్వామి, కొంగనపాడు వినోద్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# కర్నూలు జిల్లాలో విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్

## నేర నియంత్రణ, ప్రజల భద్రతే లక్ష్యం
## రాత్రివేళల్లో విస్తృతంగా తనిఖీలు
## అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా



కర్నూలు, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం రాత్రివేళల్లో విజిబుల్ పోలీసింగ్‌ను విస్తృతంగా కొనసాగిస్తున్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని సబ్‌డివిజన్ల పరిధిలో పోలీసు బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు 'స్టాప్, వాష్ అండ్ గో' కార్యక్రమం నిర్వహిస్తూ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.





# దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకం

## వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత చురుకైన భాగస్వాములు కావాలి
## చదువుతో పాటు నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి
## నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



నంద్యాల, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): దేశ నిర్మాణం, అభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని నంద్యాల ఎంపీ, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. యువత చదువుతో పాటు నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకతను పెంపొందించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. నంద్యాల మండలం అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం యువజన ప్రతిభా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో కలిసి ఎంపీ బైరెడ్డి శబరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యువజన ఉత్సవాల్లో భాగంగా జానపద నృత్యం, జానపద గీతం, నుక్కడ్ నాటకం, చిత్రలేఖనం, కవితా రచన తదితర పోటీలు నిర్వహించారు. యువత తమ కళా, సాంస్కృతిక ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ యువతలోని ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసి వారిని దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయడమే యువజన ఉత్సవాల ప్రధాన ఉద్దేశమన్నారు. వికసిత్ భారత్ 2047, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని కోరారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఉద్యోగ, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

# విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

## రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి
## ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్
## విద్యా, ఉద్యోగ, ఉపాధి హక్కుల కోసం విద్యార్థులు ఉద్యమించాలని పిలుపు
## పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎం.డి. రఫీ, ప్రధాన కార్యదర్శి ఎస్. కిరణ్ కుమార్




విజయవాడ, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎం.డి. రఫీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. కిరణ్ కుమార్ ఆరోపించారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం విజయవాడ ధర్నా చౌక్ వద్ద పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణను పటిష్టంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మెటిక్ చార్జీలు పెంచాలని కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2024--25 విద్యా సంవత్సరానికి అర్హులైన ప్రతి ఒక్కరికీ 'తల్లికి వందనం' పథకం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యారంగ సమస్యల పరిష్కారంతో పాటు విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాను, సహాయ కార్యదర్శి సిద్ధు, రాష్ట్ర నాయకులు మర్రి స్వామి, హేమ, మావో, చందు, షారుక్ ఖాన్, షాహీద్, నాగరాజు, రూపశంకర్, శీను, వంశీ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.





# త్రుటిలో తప్పిన ఆర్టీసీ బస్సు ప్రమాదం

## బస్సు ప్రమాదంపై సమగ్ర విచారణకు ప్రయాణికుల డిమాండ్
## బస్సు ఫిట్‌నెస్, నిర్వహణపై దృష్టి సారించాలని విజ్ఞప్తి
## ప్రమాదానికి అసలు కారణాలను వెల్లడించాలని కోరిన ప్రయాణికులు



కర్నూలు, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): కర్నూలు సమీపంలోని జీవసుధ పాస్టర్ సెంటర్ ఎదురుగా నందికొట్కూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు భారీ చెట్టును ఢీకొన్న ఘటనలో త్రుటిలో ప్రమాదం తప్పినట్లు సమాచారం. ఘటనతో బస్సులోని ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. బస్సులో సాంకేతిక లోపం, డ్రైవర్ తప్పిదం లేదా బస్సు నిర్వహణలో లోపాల కారణంగా ప్రమాదం జరిగిందా అనే అంశాలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్సుల ఫిట్‌నెస్, నిర్వహణ, డ్రైవర్ల భద్రతా ప్రమాణాలను పరిశీలించి లోపాలు ఉంటే తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఘటనపై ఏపీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులు విచారణ జరిపి ప్రమాదానికి అసలు కారణాలను వెల్లడించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



# ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిద్దాం

## పోలీసులకు తుది పోలింగ్ కేంద్రాల జాబితా అందజేత
## పోలింగ్ కేంద్రాలను మూడు కేటగిరీలుగా విభజించాలని సూచన
## భద్రతా ఏర్పాట్లపై ముందస్తు దృష్టి సారించాలని ఆదేశం



కర్నూలు, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): త్వరలో జరగనున్న కర్నూలు నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను ఇప్పటి నుంచే చేపట్టాలని అదనపు ఎన్నికల అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం కౌన్సిల్ హాల్లో డీఎస్పీ కె.వి. రాఘవేంద్రతో పాటు నగర పరిధిలోని సీఐలు, ఎస్ఐలతో కమిషనర్ సమావేశమయ్యారు. ఇటీవల విడుదలైన తుది పోలింగ్ కేంద్రాల జాబితాను పోలీసు అధికారులకు అందజేశారు. పోలింగ్ కేంద్రాలను సాధారణ, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మకంగా మూడు కేటగిరీలుగా విభజించి వివరాలను అందించాలని సూచించారు. నగరంలో 487 పోలింగ్ కేంద్రాల పరిధిలో 4,79,861 మంది ఓటర్లు ఉన్నారని కమిషనర్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వారీగా భద్రతా ఏర్పాట్లను ముందుగానే పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, ర్యాంపులు, విద్యుత్ దీపాలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐలు చంద్రబాబు నాయుడు, పి. శేషయ్య, బి.వి. విక్రమసింహా, జి. మారుతి శంకర్, ఎస్ఐలు మోహన్ కిషన్ రెడ్డి, ఎస్. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థిపై దాడిపై సమగ్ర విచారణ జరపాలి

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.. విద్యార్థి సంఘాల డిమాండ్



కర్నూలు, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): కర్నూలు గాయత్రి ఎస్టేట్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ బైపీసీ విద్యార్థి రవితేజపై సెకండ్ ఇయర్ విద్యార్థులు దాడి చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ-వీ, ఆర్ఎస్ఎఫ్, పీఎస్‌యూ, ఎంవీఎస్ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అంకుర అపెక్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవితేజను విద్యార్థి సంఘాల నాయకులు పరామర్శించి, ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాల పనితీరు, భద్రతా ఏర్పాట్లు, పర్యవేక్షణపై అధికారులు తనిఖీ చేయాలని కోరారు. విద్యార్థులపై ర్యాగింగ్, దాడులకు అవకాశం లేకుండా కఠిన పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని, ఫీజులు, ఇతర ఛార్జీల వసూళ్లపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రవితేజకు పూర్తి రక్షణ కల్పించి, ఘటనకు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# రెవెన్యూ లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలి

## బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి: కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): 2026--27 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన రెవెన్యూ లక్ష్యాలను సాధించేందుకు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదేశించారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ వసూళ్లపై నిర్వహించిన సమీక్షలో శాఖల వారీగా లక్ష్యాలు, సాధించిన ప్రగతి, బకాయిల పరిస్థితిని పరిశీలించారు. బకాయిల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో సమస్యలను పరిష్కరించుకుంటూ రెవెన్యూ వసూళ్లను మెరుగుపరచాలని ఆదేశించారు. సమావేశంలో వాణిజ్య పన్నులు, గనులు, పోలీస్, ఎక్సైజ్, రవాణా, రిజిస్ట్రేషన్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.




# గ్యాస్ సిలిండర్లను సకాలంలో డెలివరీ చేయాలి

## ఐవీఆర్ఎస్‌లో ప్రతికూల ఫీడ్‌బ్యాక్‌కు తావులేకుండా సేవలు అందించాలి: జేసీ సూరజ్ ధనుంజయ్





నంద్యాల, సెప్టెంబర్ 30: (మహి న్యూస్): గ్యాస్ సిలిండర్లను వినియోగదారులకు సకాలంలో డెలివరీ చేయాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గ్యాస్ ఏజెన్సీ డీలర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గ్యాస్ పంపిణీ, వినియోగదారులకు అందుతున్న సేవలపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. డెలివరీలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, ఐవీఆర్ఎస్ కాల్స్‌లో ప్రతికూల ఫీడ్‌బ్యాక్‌కు తావులేకుండా నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. వినియోగదారుల సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు డెలివరీ సిబ్బంది బాధ్యతాయుతంగా, మర్యాదగా వ్యవహరించాలని ఆదేశించారు. సమావేశంలో సివిల్ సప్లైస్ అధికారి రవిబాబు, గ్యాస్ ఏజెన్సీ డీలర్లు పాల్గొన్నారు.

# మోరగుడిలో అంగన్‌వాడీ పాఠశాలను సందర్శించిన

**- ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి**



కడప జిల్లా/జమ్మలమడుగు,మహి న్యూస్ సెప్టెంబర్ 30: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజాప్రస్థానం, పరిపాలన పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న "సేవా సంకల్ప్ అభియాన్ ఉత్సవాల్లో" భాగంగా జమ్మలమడుగు మండలం మోరగుడి గ్రామంలోని అంగన్‌వాడీ-2 ఉచిత ప్రాథమిక పాఠశాలను జమ్మలమడుగు నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యా కార్యక్రమాలు, చిన్నారులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జమ్మలమడుగు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేష్‌రెడ్డి, అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# దేవగుడి అభివృద్ధికి రూ.2.90 కోట్లతో బాటలు

## పల్లె పండుగ 3.0కు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేష్ సుబ్బరామిరెడ్డి



కడప జిల్లా/జమ్మలమడుగు మహి న్యూస్ సెప్టెంబర్ 30; గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జమ్మలమడుగు నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. జమ్మలమడుగు మండలం దేవగుడి గ్రామంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి కలిసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవగుడి గ్రామంలో రోడ్ల నిర్మాణంతో పాటు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను కలుపుకొని మొత్తం రూ.2.90 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వికసిత్ భారత్ గ్రామీణ ఉపాధి, ఆజీవిక మిషన్ గ్రామీణ కార్యక్రమాల్లో భాగంగా గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నట్లు తెలిపారు. రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధితో గ్రామానికి మరింత మెరుగైన రూపురేఖలు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని చెప్పారు.ప్రజల అవసరాలను గుర్తించి పెండింగ్‌లో ఉన్న పనులకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని నాయకులు స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రాయలసీమ రైజింగ్‌లో 'ఫ్రూట్‌ఫుల్ కడప'

## 75,028 హెక్టార్లలో ఉద్యాన సాగు విస్తరణ.. రైతు ఆదాయమే లక్ష్యం



కడప, మహి న్యూస్ సెప్టెంబరు 30: తక్కువ నీటితో అధిక దిగుబడులు.. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటల ఎంపిక.. పండించిన ఉత్పత్తికి మెరుగైన ధర.. రైతు ఆదాయమే లక్ష్యంగా వైఎస్ఆర్ కడప జిల్లాలో ఉద్యాన సాగును విస్తరిస్తున్నారు. 'రాయలసీమ రైజింగ్'లో భాగంగా జిల్లాను ఉద్యాన పంటల ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. 30 ఉద్యాన క్లస్టర్ల ద్వారా 75,028 హెక్టార్లలో సాగును విస్తరించనున్నారు. 50 మండలాలు, 382 రైతు సేవా కేంద్రాలను అనుసంధానం చేసి అరటి, నిమ్మ, మామిడి, దానిమ్మ, బొప్పాయి, మిరప, కూరగాయలు, డ్రాగన్‌ఫ్రూట్ తదితర పంటలను ప్రోత్సహించనున్నారు. సూక్ష్మ సేద్యం, ప్రకృతి వ్యవసాయం, ఆధునిక సాగు పద్ధతులతో నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు దిగుబడులు పెంచేలా చర్యలు చేపడుతున్నారు. ఉత్పత్తి అనంతరం నిల్వ, రవాణా, మార్కెటింగ్, ఎగుమతులపై దృష్టి సారించి రైతులకు మెరుగైన ధర కల్పించనున్నారు. ప్రస్తుతం రూ.10,273.87 కోట్లుగా ఉన్న ఉద్యాన రంగ స్థూల విలువను రూ.14,406.25 కోట్లకు పెంచే లక్ష్యంతో ప్రణాళిక రూపొందించారు. ఉద్యాన క్లస్టర్ల అభివృద్ధికి సుమారు రూ.1,719.58 కోట్ల పెట్టుబడి అవసరమవుతుందని అంచనా. "ఆధునిక సాగు పద్ధతులు, సూక్ష్మ సేద్యాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యాన సాగును విస్తరించాలి. రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన హబ్‌గా అభివృద్ధి చేసే లక్ష్యంలో కడప రైతులు భాగస్వాములు కావాలి." - డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా కలెక్టర్, వైఎస్ఆర్ కడప





# పంటల పరిశీలన.. రైతులకు క్షేత్రస్థాయి సూచనలు



కడప, మహి న్యూస్ సెప్టెంబరు 30: సిద్ధవటం మండలం వానతాటిపల్లి, ఒంటిమిట్ట మండలాల్లో రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు నిర్వాహకులు ఎస్.వి. ప్రవీణ్‌కుమార్ క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. వానతాటిపల్లిలో రైతు వెంకటసుబ్బయ్య సాగు చేస్తున్న పంటలు, పండ్ల మొక్కలు, కూరగాయలను పరిశీలించారు. పంటల్లో కనిపిస్తున్న పురుగులు, తెగుళ్లను గుర్తించి వాటి నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సహజ కషాయాలు, ద్రావణాలు వినియోగించాలని సూచించారు. పంటలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ ప్రారంభ దశలోనే పురుగులు, తెగుళ్లను గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు తెలిపారు. అనంతరం ఒంటిమిట్టలోని పాఠశాల వంటశాల తోటను పరిశీలించి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సి. రవీంద్రకుమార్‌తో కూరగాయలు, ఆకుకూరల సాగు, తోట నిర్వహణపై చర్చించారు. విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయం, ఆరోగ్యకరమైన ఆహారంపై అవగాహన కల్పించేందుకు వంటశాల తోట ఉపయోగపడుతుందని తెలిపారు. అదేవిధంగా పీఎండీఎస్ రైతులు, పసుపు రైతుల పంటలను పరిశీలించి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పంటల నిర్వహణ, పురుగు--తెగుళ్ల నివారణ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై సూచనలు అందించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సహాయకులు నరసింహారెడ్డితో పాటు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.







# గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌లో కడప రైతులు పెద్దఎత్తున భాగస్వాములు కావాలి..!

## రాయలసీమ రైజింగ్‌కు రైతులే కీలకం.. మంత్రి సవిత పిలుపు

## పులివెందులలో ట్రాక్టర్ ర్యాలీ ప్రారంభించిన మంత్రి సవిత, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి




కడప జిల్లా/పులివెందుల, మహి న్యూస్ సెప్టెంబరు 30: రాయలసీమను ప్రపంచస్థాయి ఉద్యాన పంటల కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న "రాయలసీమ రైజింగ్--గ్లోబల్ హార్టికల్చర్ హబ్" కార్యక్రమంలో వైఎస్ఆర్ కడప జిల్లా రైతులు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత పిలుపునిచ్చారు. ఉద్యాన పంటల ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్టోబర్ 2న అన్నమయ్య జిల్లా మదనపల్లెలో "రాయలసీమ రైజింగ్--గ్లోబల్ హార్టికల్చర్ హబ్" కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ముందస్తు ప్రచార కార్యక్రమాల్లో భాగంగా.. బుధవారం పులివెందులలో నిర్వహించిన భారీ ట్రాక్టర్ ర్యాలీని మంత్రి సవిత, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోకలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. రాయలసీమలో ఉద్యాన పంటలకు ఉన్న అపార అవకాశాలను సద్వినియోగం చేసుకుని రైతులు అధిక ఆదాయం పొందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఆధునిక సాగు పద్ధతులు, మెరుగైన మార్కెటింగ్, పంట అనంతర నిర్వహణ, శీతల గిడ్డంగులు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఎగుమతులకు అవకాశాలను పెంచడం ద్వారా ఉద్యాన రంగాన్ని మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో రైతుల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కార్యక్రమంలో వైఎస్ఆర్ కడప జిల్లా నుంచి విస్తృత భాగస్వామ్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 30 ఉద్యానవన క్లస్టర్ల నుంచి సుమారు 3,000 మంది రైతులు అక్టోబర్ 2న మదనపల్లెలో జరిగే కార్యక్రమానికి హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి క్లస్టర్‌కు రెండు బస్సుల చొప్పున ఏర్పాటు చేసి రైతులను సురక్షితంగా మదనపల్లెకు తీసుకెళ్లి తిరిగి స్వస్థలాలకు చేర్చేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపడుతున్నారని తెలిపారు. రైతులకు తాగునీరు, ఆహారం, ఇతర మౌలిక సదుపాయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 2న మదనపల్లెలో ముఖ్యమంత్రి పాల్గొనే గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రారంభ కార్యక్రమానికి జిల్లా నుంచి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని ఉద్యానవన క్లస్టర్ల రైతులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. రైతుల్లో అవగాహన, ఉత్సాహం పెంచేందుకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లతో ర్యాలీలు నిర్వహించాలని, స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కార్యక్రమం ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సామాజిక మాధ్యమాలు, పత్రికలు, ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని.. రాయలసీమను ప్రపంచ ఉద్యాన పంటల కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యానికి మద్దతు తెలిపారు. ఉద్యాన పంటల సాగు, మార్కెట్ అవకాశాలు, ఆధునిక సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ఆర్డీవో చిన్నయ్య, ఉద్యానవన, వ్యవసాయ, ఏపీఎంఐపీ, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# జిల్లా స్థాయి ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం



కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 30: జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డా. చెరుకూరి శ్రీధర్ మార్గదర్శకత్వంలో కడపలో నిర్వహించిన జిల్లా స్థాయి ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది. జిల్లా యంత్రాంగం, వైద్య ఆరోగ్య శాఖతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో నిర్వహించిన శిబిరంలో చిన్నారులు, గర్భిణీలు, మహిళలు, వృద్ధులు, యువత, విభిన్న ప్రతిభావంతులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచిత వైద్య సేవలు అందించారు. వివిధ విభాగాల వైద్య నిపుణులు వైద్య పరీక్షలు, ప్రయోగశాల పరీక్షలు, వ్యాధి నిర్ధారణ, చికిత్సపై సలహాలు అందించారు. మెప్మా, విభిన్న ప్రతిభావంతులు మరియు వృద్ధుల సంక్షేమ శాఖ, బ్యాంకింగ్ సేవలు, సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రత్యేక స్టాళ్ల ద్వారా ప్రజలకు అవగాహన, మార్గదర్శకత్వం కల్పించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, క్షేత్రస్థాయి సిబ్బందితో పాటు పోలీసు, అగ్నిమాపక, నగరపాలక సంస్థ తదితర శాఖలు సమన్వయంతో సేవలందించారు. ఒకే వేదికపై వివిధ వైద్య సేవలు అందుబాటులో ఉండటంతో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.



# యువజనోత్సవాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు



కడప, సెప్టెంబర్ 30 (మహి న్యూస్): జిల్లా స్థాయిలో నిర్వహించిన యువజనోత్సవాలు--2026లో వివిధ కళా విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జానపద నృత్యం, జానపద గీతం, నుక్కడ్ నాటకం, కవితా రచన, చిత్రలేఖనం విభాగాల్లో పోటీలు నిర్వహించారు. 30.09.2026 - పత్రికా ప్రకటన. జానపద నృత్యంలో ఆర్‌జీయూకేటీ, ఆర్‌కే వ్యాలీకి చెందిన భావ్య బృందం ప్రథమ స్థానం సాధించగా, జానపద గీతంలో లక్ష్మి బృందం ప్రథమ స్థానంలో నిలిచింది. నుక్కడ్ నాటకంలో డి.ఆకాశ్ కిరణ్ బృందం ప్రథమ బహుమతి పొందింది. 30.09.2026 - పత్రికా ప్రకటన. కవితా రచనలో టీ.ధన్విత (ఆర్‌కే వ్యాలీ), చిత్రలేఖనంలో పీ.ధనుంజయ (యోగి వేమన విశ్వవిద్యాలయం) ప్రథమ బహుమతులు సాధించారు. వివిధ విభాగాల్లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలను కూడా ప్రకటించారు. 30.09.2026 - పత్రికా ప్రకటన. కళా ప్రతిభకు వేదికగా యువజనోత్సవాలు నిలిచాయి.



# పులివెందుల సబ్‌జైలులో న్యాయ సేవల పరిశీలన




కడప జిల్లా/పులివెందుల, సెప్టెంబర్ 30 (మహి న్యూస్): పులివెందుల సబ్‌జైలు, న్యాయ సహాయ కేంద్రాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయ సహాయ కేంద్రంలోని రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసుల వివరాలు, ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, న్యాయ సహాయ రక్షణ న్యాయవాది వ్యవస్థపై అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సహాయాన్ని ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యాయ సేవల సహాయవాణి 15100పై ప్రచారం నిర్వహించారు. సమస్యలు ఉంటే పులివెందుల మండల న్యాయ సేవా సమితి లేదా కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, న్యాయ సహాయక స్వచ్ఛంద కార్యకర్తలు, ఖైదీలు పాల్గొన్నారు.



# మెగా న్యూ మాడ్యూల్ క్యాంప్‌కు ఏర్పాట్లు

కడప, సెప్టెంబర్ 30 (మహి న్యూస్): కడప గాంధీనగర్‌లోని నగరపాలక ఉన్నత పాఠశాలలో అక్టోబర్ 1న ఉదయం 8.30 గంటలకు "మెగా న్యూ మాడ్యూల్ క్యాంప్" నిర్వహించనున్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో శిబిరాన్ని నిర్వహించనున్నారు. ప్రజలకు న్యాయ సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. వికలాంగుల సంక్షేమం, రెవెన్యూ, నగరపాలక సంస్థ, పోలీస్, వైద్య ఆరోగ్యం, కార్మిక, డీఆర్‌డీఏ, దాదాస్, స్త్రీ--శిశు సంక్షేమం, జిల్లా పరిషత్, వ్యవసాయ శాఖలతో పాటు ఇతర శాఖలు ఈ కార్యక్రమంలో పాల్గొంటాయి. కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. రామ గోపాల్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సామాజిక మాధ్యమాల ప్రతినిధులు కార్యక్రమానికి హాజరై వార్తా కవరేజీ అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కోరింది.

# ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలి



రాయచోటి, మహిన్యూస్, సెప్టెంబర్ 30: ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని సూచించారు. రాయచోటి మండలంలో టీడీపీ మండల అధ్యక్షులు గండికోట సుధాకర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డితో కలిసి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని, ఏ ఒక్కరూ నష్టపోకూడదని సూచించారు. గత ఐదేళ్ల పాలనలో జగన్మోహన్ రెడ్డి 10 లక్షల కోట్ల అప్పులు చేశారని, ఒకవైపు అప్పులు తీర్చుకుంటూ మరోవైపు సంక్షేమ కార్యక్రమాలను అందిస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పింఛన్లను అందిస్తున్నామని తెలిపారు. రాయచోటిలో పేద విద్యార్థుల కోసం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సాంఘిక సంక్షేమ హాస్టల్లో మరమ్మత్తుల కోసం, అధునాతన టాయిలెట్స్ నిర్మాణం కోసం సుమారు 100 కోట్లతో పనులు చేయించడంజరిగిందని తెలిపారు. తప్పుడు ప్రచారాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ మస్తాన్వలి, టిడిపి నాయకులు గుర్రం సుబ్బయ్య నాయుడు, మేఘనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ ఉద్యాన సమగ్ర అభివృద్ధిపై

# మదనపల్లెలో డ్రోన్ లేజర్ షో

### సమాచార శాఖ ఏడి పురుషోత్తం

**మదనపల్లె, మహి న్యూస్, సెప్టెంబర్ 30: రాయలసీమ ప్రాంతాన్ని ప్రపంచస్థాయి ఉద్యానవన ఉత్పత్తుల కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - - రాయలసీమ రైజింగ్ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అక్టోబర్ 1వ తేదీ గురువారం సాయంత్రం 6.00 గంటలకు మదనపల్లె ఎన్వీఆర్ లేఅవుట్‌లోని మున్సిపల్ పార్కు వద్ద డ్రోన్ లేజర్ షో నిర్వహించడం జరుగుతుందని అన్నమయ్య జిల్లా సమాచార శాఖ ఏడి పురుషోత్తం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, సమాచార శాఖ డైరెక్టర్ మరియు అన్నమయ్య జిల్లా కలెక్టర్ వారి సూచనలను అనుసరించి గ్లోబల్ హార్టికల్చర్ హబ్ పై అవగాహన నిమిత్తం ఈ డ్రోన్ లేజర్ షో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆకాశంలో రంగురంగుల కాంతులతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ లక్ష్యాలు, రాయలసీమ ఉద్యాన రంగ అభివృద్ధి, రైతులకు కలిగే ప్రయోజనాలను ప్రదర్శించనున్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ ప్రకటనలో కోరారు.**

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPADIST, A.PPRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108.APTEL/26/A5325.APTEL/26/A3560.APTEL/26/A7631.APTEL/26/A7632 Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com